# కులభ్రష్టుడు

"అమ్మాయీ జానికమ్మా – గుండెరాయి చేసుకోవాలి మరి – పిల్లలు బెంబేలైపోతారుస్మీ. ఈ నలుసులు – వీళ్లు ఆ సోమయ్యకి ప్రతిరూపాలు – వాళ్లకోసం గతాన్ని మరిచిపోవాలి – రెక్కలు కూడదీసుకోవాలి."

శాస్తుల్లుగారి మాటలకి ఊరట కలక్కపోగా కన్నీళ్లు కట్టలు తెంచుకొస్తున్నాయి జానకమ్మకి.

జానకమ్మకి ముగ్గురాడపిల్లల తరవాత ఒక మగబిడ్డడు. ఆ తరవాత మళ్లీ ఆడపిల్లల 'టరన్' వచ్చింది. ఏటా కానుపే ఆయెను.

కొడుకు 'ఫోర్తుఫారం' చదువుతున్నాడు; వాడి పేరు విశ్వం; ఇద్దరాడపిల్లలు. ఈడేరి పెళ్లికున్నారు; చిల్లరకొట్లో కుంచమూ, సోలా, గిద్దా, అరగిద్దా... ఈ మాదిరిగా ఇంట్లో సైజుల వారీగా వుంది పిల్లల పటాలం. ఎదురొమ్ముున రెండు కుంపట్లు కణకణ లాడుతూ రెడీగా వున్నాయి. మూడోది చిటపట లాడుతోంది.

'ఇంకెక్కడ కూడదీసుకోవడం చెట్టే కూలిపోయింది. దిక్కులేని పక్షులమై మిగిలాం;' డగ్గుత్తికతో వాపోయింది జానకమ్మ.

ఆ వేళ బాకీ వసూళ్లకని ఊరూరు తిరిగి మునమునలాడుతూ ఇంటికొచ్చాడు సోమయ్య. వొంటిమీద చెయ్యివేసి చూచింది జానకమ్మ. పెళ్లున జ్వరం కాచిపోస్తోంది.

మంచం వాల్చి తలగడ సర్ది దుప్పటి కప్పింది! శైత్యాన్ని వచ్చివుంటుందనుకుని, చందున పెట్టెలోంచి తీసి కస్తూరి మాత్రవేసి, ఇంత మిరియాల కషాయమిచ్చి తెలిసీతెలియని కూరగాయ వైద్యమేదో నడిపింది ఆపద్ధర్మంగా.

తెల్లవారినాక ధర్మాసుపత్రికి పంపి ఏదైనా అరకు తెప్పిద్దామనుకుంది. తెల్లవారలేదు; హంస ఎగిరి చక్కాబోయింది.

పట్టుమని పదిరోజులు మంచంమ్మీద తీసుకున్నది లేదు; తిరుగుతూ తిరుగుతూ ఉన్న

మనిషిని పదపదమని కాటికి నెట్టినట్టయింది.

ఏడుపులూ పెడబొబ్బలతో మూడు రోజులు గడిచినై. ఇంకా నిత్యకర్మ ప్రారంభించనే లేదు.

విశ్వానికి పట్టుమని పదమూడేళ్లు లేవు. వాడికి ఉపనయనం కాలేదు.

శాస్త్తుల్లుగారు నెత్తీనోరూ బాదుకొంటూనే వున్నారు వాడికి మూడు జందెంప్పోగులూ వేదామంత్రా అని... కాని వింటేనా? 'మా ఇళ్లల్లో పెళ్లిలోనే వడుగు అదే మా ఆనవాయితీ' అంటుంది జానకమ్మ. ఇప్పుడేమయింది?' విస్సాయి కర్మకి పనికి రాకుండా పోయాడే.

ఈ రజస్వలానంతర వివాహాలొచ్చింతరవాత మరీ తెనుగుమీరిపోయింది దేశం. కలికాలం బిళ్ల పెట్టుగా వచ్చిపడిపోతోంది.

ఉపనయనం ప్రధానం పెళ్లి పునస్సంధానం అన్నీ ఏక్‌దమ్మున ఒక్క తంతుకింద కుదించి పారేస్తున్నారు. ఏ శుభకార్యానికా శుభకార్యం చక్కా విడిగా కలకలలాడుతో గడపనిండా పసుపూ గుమ్మానికి మామిడాకు తోరణం... ఇంటినిండా బిల బిలలాడుతో బంధుకోటిగట్టా... ఇంటోకి వస్తూపోతూ బ్రాహ్మణ్యమూ... ఇంటో పవిత్ర మంత్రోచ్చారణతో ఎన్నిశుభాలు జరిగితే అంత జయకరమంత్రా అంటే వినిపించుకోదుగదా ఖర్మ!

అన్నట్టు మరిచిపోయాను నిన్న తలవని తలంపుగ బెజవాడలో అవుపించాడు స్మీ... మీ మరిది...' అన్నాడు శాస్త్తుల్లు ముక్కుపొడుం కాయ చిటికెనవేలితో తాటించి ఒక్కపట్టుపీల్చి, కండవా మీద రాలిన దువ్వ దులుపుకున్నాడు.

అంత దుఖంలోనూ తేరుకుని, 'ఎవరూ? కిష్టయ్యే...' ఆత్రంగా అడిగింది జానకమ్మ.

'అవును కిష్టయ్యే కాఫీ హొటలులో ప్లేట్లు కడుగుతున్నాడు. హారి నీ ఖర్మకాలా అనుకున్నంతలో, మన ఇంటో కర్మకి పనికొస్తాడుగదా అని గుర్తుకొచ్చింది. వాడికి ఉపనయనమయింది కదా ఆ మట్న లయలువేసి లాక్కొచ్చా. వాడికి తెలీదు పాపం సోమయ్య పోయాడని.'

మాట మధ్యలో ఎవరో వస్తున్నట్లు అలికిడయి, పెణకలు లేచిపోయి పెంకులూడినచోట దూసుకొస్తున్న నీరెండకి అరచెయ్యి అడ్డం పెట్టుకుని,

'ఎవరు వారూ?' అన్నాడు శాస్త్తుల్లు మొహం చిట్లించి.

నరసింహంగారొచ్చారు.

మనిషి ఉట్టిలోపెట్టిన గుమ్మడికాయల్లే కుదిమట్టంగా వున్నాడు. చెవికి ఒంటిరాయి దుద్దులు... మల్లుపంచె... సిల్కు లాల్చీ... సేలమంచు బిళ్లమడత కండవా... మూడువేళ్లకి ఉంగరాలు... అందులో ఒక ఉంగరానికి పుష్యరాగం వేయించాడు... ఉబ్బసానికీ, ఆకస్మికమరణానికి విరుగుడని చెప్పారెవరో... ఒక ఉంగరంలో మరకతం... 'ఆకుపచ్చగా కాక సముద్రపురంగుది కొని తాపించుకో ఉంగరంలో... ఇక ఎత్తుకుంటుంది చూడు సిరి'... అని. చిదంబర రహస్యమని

పించింది కూడా... అప్పటినుంచి ఆయనకి చిదంబర శాస్త్రి అంటే గురి.

నొసట విభూతిరేకులూ, చెవిలో తులసీ దళమూ... అప్పుడే శివాలయంలో గంటకొట్టి వస్తున్నాడేమో... వస్తూనే... 'దణ్ణములండి శాస్తుల్లుగారూ' అని కూచున్నాడు బెంచీమీద.

నరసింహంగారు సంపన్న గృహస్తు యాభైయేళ్లుదాటినై.

జానకమ్మని పలకరించాలని కూడా తోచలేదాయనకి.

నేరుగా విషయాని కొచ్చేసాడు.

దినకార్యంమాట ఆలోచించారా?...

'అదే అన్నాయీ ఆలోచిస్తున్నాము... కిష్టయ్య అవుపించాట్ట' అంది జానకమ్మ తలుపు వారని నిలబడి.

'విన్నా విన్నా వాడు చెప్పినమాట వింటాడా అని?' శాస్తుల్లు వంక పరకాయించి చూచారు నరసింహంగారు.

ఈ శాస్తుల్లు అప్పుడే కిష్టయ్య అవుపించిన సంగతి ఊరువాడా మోగించేసి, నరసింహం గారిని వెనకాతల రమ్మని పురమాయించి ఇక్కడికి చక్కా వచ్చాడన్నమాట, అనుకుంది జానకమ్మ.

* * *

నరసింహంగారు రేఖేసుకుని పుట్టినవాడు. వాడవాడకల్లా పెద్దమనిషి. ఆయన్ని 'అన్నాయీ' అంటుంది జానకమ్మ.

ఆయన భక్తిప్రపత్తులు కలవాడు. మొదట్లో జపాలూ తపాలూ అంత ఆర్భాటంగా పట్టించు కునేవాడు కాదాయన. కాని, దరిమిలా కమీషన్ కొట్టుమీదా, బట్టలకొట్టుమీదా, రెండేళ్లు వరసగా కలిశొచ్చింతరవాత ఆయన పని దివిటీ లేకుండా వెలగడం ప్రారంభించింది. అప్పటినుంచి గురుడు ఏకాదశముందన్నారు గ్రహస్తితి బాగుంటే గంగవచ్చి పంగుమీద పడుతుందన్నారు.

ఒక్కపెట్టున కిరాణాదుకాణం పెద్దపచారీకొట్టు ప్రారంభించాడు. పిల్లలు చేతికందొచ్చారు – తలావొక వ్యాపారంలోనూ తలదూర్చి రెండు చేతులా డబ్బు నొల్లుతున్నారు.

ఆ దెబ్బతో దైవచింతన ప్రకోపించింది ఆయనలో.

కొందరు దరిద్రంలో భగవంతుణ్ణితిట్టి, ఐశ్వర్యమెత్తుకోగానే ఆరాధన మొదలెడతారు. తాము తిట్టిన తిట్లకీ, పెట్టిన చివాట్లకీ లొంగివచ్చి తలబొప్పికట్టి, దారికొచ్చాడు దేవుడు అనిపిస్తుందో ఏమో ఆమట్న, అదేపోనిమ్మని, కమీషన్ కింద రెండు టెంకాయలుకొట్టి, ఒక వూదువత్తి వెలిగించి చక్కావస్తారు.

కాని ఏమాట కామాటే చెప్పుకోవాలి నరసింహంగారు అట్లాంటి భక్తుడుకాదు. తనకి లేనప్పుడు భగవత్కృప లేదనుకున్నాడు అప్పుడూ, ఉదయమూ సాయంత్రమూ గుడికి వెళ్లి

వచ్చేవాడు.

అదృష్టం కలిసొచ్చింది.

ఆ కలిమి నిలవాలన్నా వాడి దయే కావాలిగదా.

చెరుకుపండేచోటికి చీమలు తామే వస్తవి! ఆయనిల్లు వచ్చేపొయ్యే బంధుకోటితో ఎప్పుడూ కిటకిటలాడుతూ వుంటుంది.

ఎప్పుడూ ఏదో ఒక శుభం జరుగుతూ వుంటుందాయింటో.

లక్షవత్తుల నోమనీ, నందికేశుడి నోమనీ... ఒకటే సందడి.

ఆయన భార్య సరేసరి కైలాసగిరిదేవి నోమనీ, గ్రామకుంభం నోమనీ ఎడతెరిపిలేకుండా మెడనిండా గంపెడునగలుపెట్టుకొని బొంగరంలా తిరుగుతూ వుంటుంది.

ముత్తయిదువుతనాని కేవ్రతమో, ఇంటాయన ఆరోగ్య సౌభాగ్యాని కేనోమో అన్నీ వ్రాసిపెట్టే వున్నాయికదా వావిళ్లవారి 'స్త్రీలవ్రతాల కథల' పుస్తకంలో.

ఆ మధ్య వేరుశనగలో దెబ్బతిన్నాడు.

అదిగో ఏటా కార్తీకంలో యథావిధిగా చేసే వ్రతాన్ని మార్గశిరానికి వాయిదా వేశావు. అదిగో మొన్న చూచా రథోత్సవంనాడు జనార్ధనస్వామి కోవెలలోకి డాగుపడిన అరటిపండు దేవునికి నైవేద్యం పట్టికెళ్లావు జ్ఞాపకం తెచ్చుకో,' అని ఖచ్చితంగా ఎత్తిచూపాడు వెంకటశాస్తుల్లు.

ఉలిక్కిపడ్డారు నరసింహంగారు.

వ్రతం వాయిదాలమాట నిజమేకాని అరటిపండుమీద డాగు చూచుకోలేదు మరితను. ఏమో దిక్కుమాలినగోల. అసలు గుడికివెళ్లే అలవాటేలేని వ్యక్తి బేఫర్వాగా సంచరించవచ్చును. కాని, గుడికివెళుతూ, దేవుడికిచ్చే నైవేద్యంలో నకిలీ చూచుకోకపోతే బెడిసికొడుతుంది. నరసింహం గారికి తెలుసు.

ఇకపోతే, దానికి పరిహారంగా శనిత్రయోదశినాడు తైలాభిషేకం చేయించాడు వెంకట శాస్తుల్లు. ఆపైన, దేవుడు మేలుచేస్తే, తిలదానం చేయించాడు. అయితే ఆ దానం వెంకటశాస్తుల్లు పట్టడు. 'అట్లాంటి దానాలు పట్టనుగాక పట్టను...' అంటాడు శాస్తుల్లు. అందుకే ఆయనంటే గురి నరసింహంగారికి దానికి భైరవశాస్తుల్ని లాక్కొచ్చి అయిదు రూపాయలిప్పించాడు.

ఆ కార్యక్రమం తరవాత కూడా దానిసిగదరగా, చింతపండులో చిన్నదెబ్బ తగిలింది.

అయితే, నష్టం మూడువేలు రావాలిసింది వెయ్యితో సరిపోయింది.

'రెండువేలు కలిసిరాలే?' అన్నాడు వెంకటశాస్తుల్లు.

'అద్దదీ' అనుకున్నాడు నరసింహంగారు. నరసింహంగారి లెఖ్ఖలు తమాషాగానే వుంటై.

ఒక సంవత్సరం,... 'పదివేలనష్టం వచ్చింది పదివేలు పదివేలు' అని ఏకఇదయ్యారు నరసింహంగారు.

మళ్లీ ఎంగిలిచేత్తో సాగుతుండెను. ఒక అయిటంలో కాస్త నష్టంవచ్చినా ఇంకొహ దాంట్లో కూడా ఈయనగారికి... నష్ట మెట్లావచ్చిందా అని ఆరాలడిగాడు వెంకటశాస్తుల్లు.

మోకాట్లో మెడనరం బెణికిందంటాడాయన.

ఏటా ఎలాలేదన్నా నలభయ్యారు వేలు లాభం పలికెదట అన్నివ్యాపారాలమీదా కలిపి. ఈ యేడు దరహమ్మీద ముప్ఫయ్యారే లెక్క తేలిందట అంచేత నష్టం పదివేలట!

'ఓయ్ నీ యిల్లు బంగారంగాను... ఇదిటయ్యా నష్టమంటేనూ?' అని పకాలుమన్నాడు వెంకటశాస్తుల్లు.

'నీ కట్టాగే ఉంటుందిలే పంతులూ,' ఓరగా చూచి, ఉంగరాలచెయ్యి ఊగించుకుంటూ చక్కాబోయారు నరసింహంగారు.

మాటలు నడుస్తుండగా కిష్టయ్య వచ్చాడు.

టెరిలిన్ బుష్షర్టూ, ఖాకీ నిక్కరూ వాడూ... రౌడీకత్తుగా వుంది మొహం.

జానకమ్మ గుడ్లనీరు కుక్కుకున్నది.

కిష్టుడు వదినని పలకరించి పరామర్శించాడు.

ఈ నరసింహంగారు ఇక్కడ వున్నాడేమా అని మీమాంస వచ్చింది కిష్టాయికి. ఈయనకి అంగట్లో బెల్లం ఆత్మలో విషం.

చక్కట్లు దిద్దడానికిమటుకు తయారవుతాడన్నిటికీ. ఎవరిచ్చారయ్యా నీకీ పెత్తనమంటే, అదిగో ఆ మూలవుంటే బుజాన వేసుకున్నానంటాడు; తేలుకి పెత్తనమిస్తే తెల్లవార్లూ అంటబొడిచిందట! ఏదో కొంప ముంచుతారు అనుకున్నాడు కిష్టుడు.

ఆయనకీ కిష్టాయికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది.

వెనక ఈ నరసింహంగారే కిష్టాయికేమీ పెళ్లి సమంధాలు ఎక్కిరాకుండా చేసాడు.

ఆయనే తన సర్వనాశనానికి కారణమని కిష్టయ్యకి ఎవరు పిల్లనిస్తామని వచ్చినా, ఏదో సందర్భం చూచుకొని, కిష్టయ్య మిలిటరీకి వెళ్లివచ్చాడని చల్లగా ఊదేవాడాయన.

దానితో సమంధాలు తిరిగిపొయ్యేవి.

ఈయనగారు పనిగట్టుకొని ఆ సమాచారం భుజానవేసుకుని మోస్తాడేమో అని అప్పట్లో, సోమయ్యకీ కష్టంగానే వుండేది. కాని, నరసింహంగారు ఆ మాత్రం సమాధానం చెప్పలేడూ?

'ఒరేయి సోమయ్యా' నరసింహంగారు ఎవరినయినా సరే ఒరేయంటాడు.

'ఏదయినా మనందాస్తే దాగుతుందిట్రా? మొదట్లోనే ఉన్నపరిస్థితి ఫలానా అని మొహాన కొట్టిననాడు... ఉత్తరోత్తరా... నిజం పొక్కినా... ఏ నస్మరంతీ మనమీద నెపం వేశేందుకుండదు చూడు' అని లవుక్యంగా సర్దిచెప్పేవాడు.

కాబోలనుకునేవాడు సోమయ్యానూ.

అంచాత, కిష్టయ్యకి ఎంతకీ సమంధం కుదరని మాట చాలా వరకు నిజమేను.

అయితే, ఏ వయస్సుకాముచ్చట నడపకపోతే, చీమూ నెత్తురూఉన్న మనిషికి వొళ్లు చేదెక్కక మానుతుందా?

అందరూ కలిసి రాజవీధి ఖూసిపెడితే పీడాబాయిరి సందులూ గొందులూ పట్టాడు కిష్టయ్య.

ఆమట్న, అదుగో ఆ ఆసుపత్రి నర్సు మంచాడనీ ఇదిగో ఈ రోడ్డు మొగని ఈలవేశాడనీ పుకార్లు రేగినయ్యి తనమీద.

నర్సుమాటా ఈలమాటా నిజమే అయినా అలాంటి వార్తలకి కాస్త గాలిపోగుచేసి... పత్రికలలో పతాకశీర్షికలల్లే నాలికమీద హెచ్చవేసి... నలుమూలలా పంచిపెట్టే అలవాటుంది నరసింహం గారికి.

ఆయనకి నకిలీ అంటే సుతరామూ గిట్టదు మరి.

అంచాత నరసింహంగారంటే కిష్టాయికి గుర్రు.

'ఒరే కిష్టా ఇటు చూడు ఏడవడానికట్రా వచ్చావూ? అన్నగారి రుణం తీర్చుకో, బోధపడిందా? ఈ కర్మకాండ యావత్తూ అయిందనిపించి... పిల్లా జల్లా... ఈ కామాటమంతా... అదిగో ఆమె నెత్తిన రుద్ది చక్కాబోతావో... నాలుగు రోజులు అదిగో... ఆ విస్సాయి చేతికందివచ్చే దాకా ఇల్లు కాస్త నిలబెడతావో... ఆలోచించుకో.'

కర్మకాండ! కిష్టాయికి ధర్మసందేహాలు మొదలయినై.

వాటికి మొగుళ్లు యక్షప్రశ్నలు!

సరుకుల జాబితా పట్టుకొచ్చాడు వెంకట శాస్తుల్లు.

నిత్యకర్మ ఎప్పుడు ప్రారంభించాల్నో, ఏమేమి సరంజామ సమకూర్చుకోవాల్నో మాట్లాడు కొంటున్నారు తబిశీలుగా.

జాబితా చూచి తెల్లబోయాడు కిష్టుడు.

'ఇవన్నీ కావాలిసిందేనా?' అని నాన్చాడు.

ముల్లాలు ముష్టెత్తుకుంటూవుంటే పీర్లకి పంచదారట!

గోదాన ప్రసక్తి వచ్చింది.

'గోదానమే?' నోరు వెళ్లబెట్టాడు కిష్టుడు.

'ఒరే కిష్టాయియీ నోరుముయ్యి. శాస్తుల్లు గారూ, చూసారా వీడి ధోరణి?' ముదలకించాడు నరసింహంగారు.

'గుఱ్ఱానెక్కి వచ్చావేమిట్రా? నాలుగు చకారపుగుళ్లు తింటేనేగాని దారికి రావాయేం?'... ఆయనకి కిష్టుడంటే నల్లేరుమీద బండి నడక.

'ఒరే నాయనా' శాస్తుల్లుగారు ఉపదేశ ముద్రపట్టారు.

'నువ్వుదానమిచ్చే గోమహాలక్ష్మి వుంది చూశావూ మీ అన్నయ్యకి స్వర్గప్రాప్తి కలగాలెనంటే వైతరిణి అని ఒక నది అడ్డువస్తుందిలే దానిని దాటేస్తుంది అదీ గోదాన ఫలితం. నీకు తెలియదు. కిష్టుడు తొణకలేదు. ఆయనకేం చెబుతాడు పుడితే బారసాలకట్నం, ఛస్తే వైతరిణీగోదానం.

'ఇప్పుడు వేసంకాలం కదండీ శాస్తుల్లుగారూ, వైతరిణీనది ఎండిపోయి వుంటుంది లెండి అంచాత.'

'హరి నీ కదుపుడకా వైతరిణీ ఎండడమేమిట్రా? వేసంగిలోనే దానికి వరదలు!'

కామవరపు జీడిలా పట్టుకున్నాడు శాస్తుల్లు.

'అబ్బ మా అన్నయ్యకి ఈత బాగా వచ్చును లెస్తురూ. పైగా అది వరదలమీద ఉంటుం దంటున్నారా ఆ గోవు కాస్తా బుదుంగుమన్నా, సర్గానికి పోతూపోతూ గోహత్యాపాతకమొకటి మెడకి తగిలించుకున్నట్టవుతుంది... ఎందుకొచ్చిన గోల?'

వీడు కాలికివేస్తే వేలికీ, వేలికివేస్తే కాలికీ వేస్తున్నాడు వీడి నోరు మూయించడమెట్లనా అని పట్టుకుంది శాస్తుల్లుకి.

నరసింహంగారు వత్తాసీ వచ్చారు.

'చూసారా వీడివరస నేను చెప్పలేదుటండీ? వీడు మిలట్రీకి వెళ్లాడుగా... మనిషి నెత్తురు తాగే మచ్చుముఖం. వీడికి దేవుడా దెయ్యమా?'

మిలటరీ సంగతి ఎత్తగానే కిష్టయ్యకి చిర్రెత్తుకొచ్చింది.

'మిలట్రీ ఆట మిలట్రీ... అవును పొట్ట గడవక వెళ్లాను... మా అన్నయ్యకి బరువు తగ్గు తుందని వెళ్లాను... ఎవడి కొంపా తీద్దామని పోలేదు.

అక్కడికీ మాటకి మాట తెగులని ఆ ప్రస్తాపన తుంచేసాడు కిష్టయ్య.

అయినా ఘర్షణ పెరిగింది.

'చూశావా... జానకమ్మా... జాగర్తగా విను' అని హెచ్చరిస్తూ నరసింహంగారు పెద్ద మనిషిగా తను వస్తే వాడి దూకుడు చూడమన్నట్టు మొహం పెట్టాడు.

ఆఖరికి కిష్టయ్య కుండబద్దలు కొట్టాడు.

'శాస్తుల్లుగారూ. ఒక్కమనవి... నేను కొట్లో లెఖ్ఖలన్నీ చూచేవచ్చా. మా అన్నయ్య సంసారం చితికిపోయింది. ఇది చూశారూ... ఈ యిల్లు... అద్దెకొంప... అవతల వీధిని ఓ కిరాణాకొట్టూ, స్తలమూ వుంది... అది రెండువేలకి తణఖా... చిత్తగించారా... పరిగెత్తమనేవాళ్లేగాని, పడితే లేవనెత్తేనాథుడు కనబడదు ఆనక.'

వెనువెంటనే నరసింహంగారు అందుకున్నారు.

'అమ్మాయీ జానికమ్మా... ఒక్కమాట వింటావా? మీరంతా చిన్నవాళ్లు... మీకు తెలియదు... ఈ వూళ్లో మనయింటి పెరటివాళ్లు ముప్ఫయ్యిళ్లదాకా వున్నారు... వాళ్లంతా ధర్మోదకాలు వొదిలేందుకు వస్తారు.'

'ఆ... వీళ్లందర్నీ భోజనాలకి పిలవాలిసిందేనా?' కిష్టాయి ఒక చిన్న అరుపు అరిచాడు.

'అమ్మాయీ అంతా సంబాళించుకోవాలి... కర్మ చెయ్యాలి... చేసితీరాలి... లేకపోతే... పుట్టగతులుండవుస్మీ, మాల మాదిగలకిందలెక్క, ఏమనుకున్నావోను చచ్చి స్వర్గాన వున్నాడు... వాడంటే మాకు ప్రాణం ఎట్లా చేస్తావో... ఎట్లా చేయిస్తావో... నీ ఇష్టం... ఎవరి ఖర్మ కెవరు కర్తలు? నా దారిన నేను పోతున్నా... నాకెందుకీ రభస?'

గిరుక్కునలేచి, దుర్వాసుడల్లే మొహంపెట్టి విసవిస నడిచిపోయాడు నరసింహంగారు.

వాన వెలిసినట్టయింది.

కాస్సేపు మవునంగా ఊరుకున్నారందరూ.

జానకమ్మకి బెంగ పట్టుకుంది.

నరసింహంగారి రవుద్రాకారం చూడగానే, పెనిమిటికి పట్టబోయే దుర్గతులు కళ్లకి గట్టినయ్యామెకి. బ్రతికి ఉన్నన్నాళ్లూ ఆయన సుఖపడిందిలేదు. కొట్టూ ఇల్లూ బాకీలూ పిల్లా జల్లా దూలెంత జబ్బులూ బాలెంత జబ్బులూ బాలారిష్టాలూ... ఇంటినిండా లుకలుకలాడుతో కుచేల సంతానం... మొలచుట్టూ తాయిత్తులూ... మెడలో కోరింతతాళ్లూ... శ్లేష్మంలో ఈగలా కొట్టుకున్నాడు; పరలోకంలో అయినా... జానకమ్మకి ఆ లోకం ఎట్లా వుంటుందో వర్ణించి చెప్పారంతా... అక్కడికి వెళ్లి, అదంతా స్వయంగా చూచి వచ్చినంత స్పష్టంగా... పూస గుచ్చినట్టు మళ్లీ... ఆమె వొణికిపోయింది.

శాస్తుల్లు రాజీ ధోరణిలో పడ్డాడు.

'అయితే, కిష్టాయీ, ఏమంటావురా మరీ?' ఆయన చెవుల కుండలాలు అల్లల్లాడాయి.

'నేనంటాను శాస్తుల్లుగారు... నామాట కొట్టెయ్యకండి... రెండుశేర్ల బియ్యం తెస్తాను... కాస్త పసుపుగూడా కలిపి అక్షింతలుచేసి తంతుజరిపెయ్యండి... ఆఖర్న ఓ అర్ధరూపాయి డబ్బులు ముట్ట జెబుతాను తమకి... మా అన్నయ్యని తలుచుకుని, కళ్లుమూసుకుని, ఆయన జ్ఞాపకార్థం ఒక దణ్ణం పెడతాము. ఆ తరవాత మా ఏడుపు మేమేడుస్తాము. మా మానాన మమ్మల్ని వొదిలెయ్యండి...

'ఏమిటేమిటీ?' శాస్తుల్లు కొయ్యబారి పోయాడు.

'కాదంటారూ... నా దారిన నేను పోతాను... చేతులారా ఈ పిల్లలందరినోట్లోనూ మట్టి గొట్టలేను నేను' చివాల్నలేచి తుండుగుడ్డ సవరించుకున్నాడు, కిష్టుడు.

జానకమ్మ బ్రతిమలాడింది. బామాలింది... కాళ్లావేళ్లా పడినంత దీనంగా వేడుకొంది.

'కిష్టయ్యా... ఏదో ఒహలా గట్టెక్కించు నాయనా... మమ్మల్ని ఈ నట్టేట్లోముంచిపోతావా? ఆ కర్మకాస్తా అయిందనిపించి... మీ అన్నయ్యకి గతులు కలిపించు నాయన్నాయన...'

'అబ్బ... అదికాదు వదినా... కర్మ చెయ్యననటం లేదు నేను... చేస్తా... ఇంటో చిల్లిగవ్వ లేదు... ఎట్లా చేయిస్తారో చేయించండి శాస్తుల్లుగారూ... ఇంటో మంచినీళ్లు మినహా మరి సామాగ్రి లేదు.'

ముక్కాలిపీటమీద గొంతుక్కూచుని, ముడుకులమధ్య తలకాయివుంచి, మెదలకుండా ఊరుకున్నాడు కిష్టాయి.

కిష్టుడికి అన్నయ్యంటే భయముండేది. కాని వదినంటే భక్తి.

ఈ సంసారమొక మహాసాగరమైతే అందులో నిలువీత ఈదుతున్న ఇల్లాలామె.

'కొట్లో సరుకులున్నాయిగదరా... నీది మరీ అడివిగోలరా కిష్టాయి,' అని అదిలించాడు శాస్తుల్లు అటునుంచి నరుక్కొద్దామని.

'ఆ తరువాత కొట్టు తెరవక్కర్లేదూ? అలా వుండనీండి... మరి దానాలు, దక్షిణలు, సంభావనలు... పొత్తర్లు... ఎంత భారీ తతంగమూ?'

'నువ్వు అట్లా అంటున్నావు గాబట్టి వొరే నేను వెళ్లి మాట్లాడివస్తానుండు నరసింహం గారితో... ఆయన తలుచుకుంటే...' అని అందించాడు శాస్తుల్లు.

కిష్టాయి దానితో కాస్త పుంజుకున్నాడు.

'వో దివ్యంగా... నరసింహంగారు తలుచుకున్నట్టయినా... ఇదెంత ఘనకార్యమండీ... మా వాళ్ల యిళ్లు ఓ ముప్ఫయిదాకా వున్నాయండి ఈ వాడకట్టులో 'ఓ నాలుగు వందలు' అందర్నీ కూడగట్టి అడ్డం వెయ్యమనండి... నరసింహంగారు వొక్కరూ, చచ్చుసంభావన, వో నాలుగు వందలు గిరాటెయ్యగల మోతుబరి.'

'దాని సిగదరగ, ఒక ఎనిమిది వందలు పుట్టించలేమట్రా' ఎక్తారీగా వల్లెవాటు సవరించు కున్నాడు శాస్తుల్లు.

దగ్గరికి జరిగి – 'మీరు చెప్పడంలో వుంది శాస్తుల్లుగారూ,' అని ఎగదోశాడు కిష్టుడు.

'అదే నోటు ఎవరిపేర వ్రాయించనా అని?' వాసాలవంక చూచి మీనమేషాలు లెక్కపెట్టాడు

శాస్తుల్లు.

'సరిపోయింది నోటేమిటి?' తెల్లబోయాడు కిష్టుడు.

'నోటు లేకుండా ఎవడిస్తాడురా బదులూ?.

మొదటికొచ్చింది వ్యవహారం.

'అదేమిటి? బదులా మీరంటూంటా?'

'ఏడిసినట్టేవుంది... చందాలు వేసుకుని సప్లయి చేస్తారనుకుంటున్నావేమిట్రా మరి? ఒరేయి ఎంతెంతాలోచనలున్నాయిరా నీ కడుపులో? అందులోనూ నరసింహంగారా చేతిచమురు భాగోతాలకి దిగేది?... సరి సరి' నీళ్లు గార్చాడు శాస్తుల్లు.

ఆ సందు చూచుకొని, జానకమ్మ శాస్తుల్లు గారిని తరిమింది.

'అతనితో ఏమిటిగాని, మీరు వెళ్లి నరసింహంగారితో మాట్లాడి నోటు వ్రాయించి పట్టుకురండి శాస్తుల్లుగారూ నేను సంతకం చేస్తా' అంది.

ఈ కిష్టుడు వ్యవహారం మళ్లీ తిరగదోడినా తోడవచ్చని ఆమట్న గభీమని అటుకేసి ఉడాయించాడు శాస్తుల్లు.

కిష్టాయి కిదంతా అయోమయంగా వుంది.

'నాయన్నాయన ముందీ గట్టెక్కించు' అంది జానకమ్మ.

గట్టెకించమంటుందేమిటి? గోతిలోకి నెట్టడమిది. ఆమెకి తెలీకుండా వచ్చింది ఖర్మ.

'నాకు నిజంగా భయంగా వుంది వదినా... ఈ అప్పులూ... ఈ ఖర్చులూ...'

'నాయనా కాస్సేపు చెప్పినట్టు విను రేపు అమ్మాయి పెళ్లికున్నదా... ఇప్పుడు సలక్షణంగా ఈ కర్మకాండ చెయ్యకపోతిమా, వెలివేసినంతపని జరుగుతుంది. పాషండులమని యాగీ చేస్తారంతా... ఒక్క నరసింహంగారే కాదు... నువ్వేరగవూ?... నీ పెళ్లి ఓ పట్టాన కుదరనిచ్చారా? మిలటరీకి వెళ్లావనీ... అడ్డమైన తిళ్లూ తిన్నావనీ... చేశావనీ... ఒకటేమిటి?'

కిష్టాయి ఆస్తిమితంగా కాస్సేపు అటూ యిటూ పచారు చేశాడు. వొంటిని తేళ్లూ, జెర్రులూ పాకుతున్నట్టుంది అతగాడికి.

'అయితే ఇక తప్పేదేముంది? నేనే నరసింహం గారి దగ్గరకి వెళ్లీ నోటు వ్రాసి పట్టుకొస్తా నొక ఎనిమిది వందలు... మళ్లీ నీ సంతకమెందుకూ?'

చీడీలు దిగాడు కిష్టుడు.

జానకమ్మ మనస్సు కుదుటబడింది.

* * *

కర్మ యధావిధిగా పెట్టాడు కిష్టుడు కిమ్మనకుండా.

తిలదానం, హిరణ్యదానం, ఆజ్యదానం... ధాన్యదానం, గుడదానం, ఉదకుంభదానం, లవణదానం... దశదానాలూ ఇప్పించారు. నరసింహంగారు దగ్గరుండి కంజూయింపుగా అన్నీ యధావిధిగా చేయింపించారు.

భూదానానికిమటుకు నేలగిల్లి ఊరుకున్నాడు కిష్టయ్య. సోమయ్యకున్నవి రుద్రభూములే ఆయెను.

లగ్గపొత్తర్లిప్పించారు ఘనంగా.

చుట్టాలుపక్కాలు వచ్చిపడ్డారు.

రాకపోతే రాలేదని నిష్ఠూరం మొకటాయెను. భోజనాలు నడుస్తున్నాయి పదోరోజు.

శనగపప్పు 'బ్లాక్'లో కొనాలిసివచ్చినా బూరెలు చెయ్యడం తప్పలేదు. గారెలు సరేసరి పితృదేవతకి ఇష్టమట.

మజ్జిగ ఉషాధారపునీళ్లనీ, నెయ్యికాదు వడ్డిస్తా, కేవలం డాల్డా అనీ భోక్తలు పెదవి విరిచారు.

కాని పొదుగుదగ్గర పితికిన పాలకీ, పచ్చకర్పూరంలాంటి నిఖార్సయిన వేచ్చుక్కకీ చెల్లించాలిసిన రేటునే చేతిచమురు వదిలింది. అది లగ్గసరి కూడాను వంటమనుషులు రోజుకి ఎనిమిది రూపాయల చొప్పునగాని పలకలేదు.

మారువడ్డనకిరాని అయిటము లేవో గుర్తు పెట్టుకుని, గుచ్చిగుచ్చి మరీ జ్ఞాపకం చేస్తున్నారు కొందరు పెద్దలు.

డాల్డా అని అనుమానం ముమ్మరంగావున్నా, నేతిరుఖాడీ వచ్చినప్పుడుమాత్రం, బూరెలకి చూపుడు వేలు పొడిచి రెడీగా ఉండటంలో భోక్తులు ఏమరుపాటు లేకుండా చురుగ్గా వ్యవహరించారు.

'ఏమోయ్ బావా ఇంకో నాలుగు గారెలు వేయించుకోరాదూ అట్లా వెయ్యండి సార్... ఇట్టె అరిగించుకోగలదులెండి... ఎవరో తెలుసాండి? పేరే గణపతి!' ఒక పోతరాజు 'రికమండేషన్.'

అవతల పంక్తిలో కూచున్న ఆ పోతరాజుకి, తనమీద, ఆధార్తుగా, అవ్యాజంగా, అంతచేటు మమత్వం ఎందుకు పుట్టుకొచ్చిందో చట్టున స్ఫురించక... పల్లికిలించి చక్కా ఊరుకున్నాడు... ఇవతల పంక్తిలో విస్తట్లో కుస్తీ పడుతున్న గణపతి.

ఎందునా కాకపోయినా... ముఖ్యంగా పంక్తి భోజనాలలో... సిఫార్సు లెందుకుచేస్తారూ? సిఫార్సులు తిరిగి చేయించు కుందుకు... అన్న ప్రాథమిక సూత్రమైనా అర్థంకాని గణపతిమీద ఆశ వొదులుకుని, ఆ పోతరాజు మరో యంబ్రహ్మని పట్టుకున్నాడు తన ప్రయోగానికి.

'అమ్మాయీ... ఆ చక్రపొంగలి చప్పున తినవే నీదుంపతెగా... మళ్లీ మారొస్తుంది...

ఏడువు... పులుసన్నం వొదిలేస్తువుగానిలే... చక్రపొంగలి తిను ముండు...చెవలనాగమ్మ! అన్నీ చెప్పాలి'

ఒకామె, కక్కుర్తి అలవాట్లింకా వొంట బట్టించుకోని ఎనిమిదేళ్ల కుమార్తెని, ఏక మోచేత్తో పొడిచేస్తోంది.

అటూ యిటూ చూచి, 'మరీ' వెనకపడిపోతున్నాను గావును,' అనుకొని ఆబగా నోట్లో కుక్కుకుంటున్నదాపిల్ల.

మధ్య మధ్య, 'గోవిందా' అనీ, 'అక్రూరవరద గోవిందా, ఆంజనేయవరదగోవిందా' అనీ జైకొడుతూ కొందరు పెద్దరికం వహించి ఆ మిషమీద పొట్టలో ఆత్మారాముణ్ణి కాస్త సందిమ్మని హడలగొడుతున్నారు.

భోజనాలు కొందరివయినై కొందరివి కాలేదు. పంక్తి పంక్తీ... ఏకంగా... ఒక్కసారే లేవాలి - కాస్తఖాళీ మిగిలివున్నట్టు అనుమానం సోకినీ్న... భోజనాలు ముగిసిన కొందరు పెద్దలు గ్లాసుల్లో పెరుగుపోయించుకునీ, గారెలు మారుపత్రమ్మనీ, వొదిలేసిన వడియాలు కర కర నములుతోనూ, పాపం ఇబ్బందిగా కాలక్షేపం చేస్తున్నారు.

విస్తళ్లలో తిన్నంత మిగిలిపోయింది.

భోక్తలు తృప్తిగా భోంచేసి బ్రేవుమని త్రేనుస్తుంటే జానకమ్మకి అనిర్వచనీయమైన ఆనందం కలిగింది.

సోమయ్యకి విస్తరివేసి, పులుసు మరిగిందా, కూరలో కారం సరిపోయిందా అని అయిటంవారీగా ఆరాలడుగుతో కొసరికొసరి వడ్డనచేస్తున్న వయనం గుర్తుకొచ్చిందామెకి.

కిష్టాయి వడ్డనలో మునిగిపోయినా, అటూ ఇటూ పారజూచుకుంటూనేవున్నాడు. అతగాడికి ఒకటే దేవుతున్నది లోపల; ఎన్నివిస్తళ్లు పడుతున్నదీ, ఎన్ని బంతులు లేస్తున్నదీ ఒకటే లెక్క, నేతిఝూడీ తొండమెంత లావుగా వున్నదీ, గాడిపొయ్యిమీద గారెలెన్నివాయిలు తీస్తున్నదీ, ఎంత పదార్థం వేస్టయిపోతున్నదీ ఒకటే మధన. సరిఘ్మా తూచినట్టు ఎంత భోంచెయ్య గలరో బొటాబోటీగా అంతే వడ్డన చెయ్యగలవాడెవడు?

అక్కడికీ లోపాయకారీగా, వంట మనుషుల్తో కాస్త చూచి వడ్డించమనీ, పెద్దలకీ, పిన్నలకీ ఒకే మోతాదులో వడ్డన చెయ్యవద్దనీ, వద్దంటుంటే మొండిగా, పట్టుబలవంతాన, పిండివంటలు వడ్డించవద్దనీ ముందుగా హెచ్చరికలివ్వనే ఇచ్చాడు.

అయితే, పురమాయించిన నగకిపట్టే బంగారం విషయంలో కమసాలికీ భోజనాలలో వండి వడ్డించే వంటమనిషులకీ అలాంటి కాపీనాలు సుతరామూగిట్టవు... సరికదా... ఆ సందర్భాలలో వాళ్ల చేతులు మంచి భారీగా వుంటాయి.

పదార్థం తమది కానప్పుడయినా దృక్పథం విశాలం కాకపోతే ఎట్లా?

గోదాన మిచ్చారు.

జానకమ్మ, కిష్టయ్యా, పిల్లలూ... చుట్టూ ముమ్మారు దణ్ణంపెడుతూ ప్రదక్షిణ చేసారు. తోక ఎత్తిపట్టుకొని... బ్రాహ్మణ్యం మంత్రాలు చదువుతో నీళ్లు ధారపోసారు యధావిధిగా గోదానం జరిగింది.

ఆవు కాస్త కుంటిది.

నరసింహంగారు కిష్టయ్యని పిలిచి చివాట్లు వేశారు.

'అక్కడికీ నూటపది చెల్లించాము బాబాయ్... ఆ కుంటిగాని లేకపోతే రెండువందల పై చిలుకుమాట.'

కిష్టయ్య మాటిమాటికీ ధనాభావం వెళ్లబొయ్యడం మహాచికాగ్గావుంది నరసింహంగారికి.

'కాని డబ్బేదీ?' ఒకటేపాట కిష్టుడు.

'నోరుముయ్యరా!' గదమాయించారు నరసింహంగారు.

వాడి కర్థంకాదు. అదీ వచ్చిన అసిఘాత.

మెల్లిగా పక్కకి తీసికెళ్లి బోధపరిచారు నరసింహంగారు.

'దీనితో మూడో గోదానంస్మీ ఈ శాస్త్రుల్లు పడతా తెలుసా కిష్టిగా?'

'కావచ్చు.'

'నీ శ్రాద్ధం. అన్ని గోవుల్నేమి చేసుకుంటాడురా ఈయన?'

'కొన్ని అమ్ముకోనీ.'

'ఈ కుంటిదాన్నెవడు కొంటాడు?'

'కొనకపోతే మానె ఆయన దగ్గర్నే కుంటనీ,

'ఎవడూ కొనకపోతే... గబేళాకీ తోలతాడురా వాజా'

చెవి మెలేశాడు నరసింహంగారు.

కిష్టాయి కిదంతా గాడిద గత్తరగా వుంది.

'గోవుని దానమిచ్చినతరువాత ఆ బ్రాహ్మణుడు ఏమిచేసుకుంటే మనకెందుకూ?' అంటాడు చక్కగా.

'పోరా పోకిరీ.' మొహం చెండుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకొంటో వెళ్లిపోయారు నరసింహంగారు దెందులోవున్న తిరకాసు వాడి బుర్రకి పట్టించేదెట్లాగో ఆయనకెంతకీ తెమలలేదు.

కాని నరసింహంగారిచ్చిన హెచ్చరికలు ఖాతరు చెయ్యనందుకు కిష్టయ్య త్వరలోనే గుణపాఠం నేర్చుకున్నాడు.

తరవాత కొన్నాళ్లదాకా ఆ గోమాత సంత పాటిమీద పుచ్చువంకాయిలు తింటోనో,

రాత్రిళ్లు పెంటకుప్పలమీద పుల్లిస్తరాకులు పెళ్లగించి కర కర నముల్తోనే అగుపించడం జరిగింది కొందరికి. దానితో, అది అక్కడక్కడే కాలక్షేపం చేస్తున్నదనీ, దానికి కడుపే కైలాసమనీ, అది అన్యాయమని వైతరిణీనది దాటించాలిసిన పనిమీద అటుకేసి వెళ్లిన పాపాన పోలేదని, దాన్ని అటు పంపాలిసిన బాధ్యత దానం పట్టిన బ్రాహ్మణోత్తముడికి ఏ కోసానా లేదనీ, కిష్టాయి గ్రహించాడు. అసలు దాని పోషణ తన కర్తవ్యం కానట్టు దాన్ని రికామీగా వదిలి ఊరుకోవడంలో ఆ పెద్దమనిషి ఉద్దేశ్యం ఏమిటీ అనీ మీమాంసకూడా వచ్చింది.

తరవాత దశ దాన్ని గబేళాకి పట్టించడం కాదు గదా!

చుట్టుపక్కల అంతా కంగారు పడిపోయారు.

'గోదానం చెయ్యకుండానే ఉండాలిగాని, తీరా మోసి గోదానం చేసి, దాన్ని తోలే పరిస్థితుల్ని చూస్తూచూస్తూ ఉపేక్షించి ఊరుకున్నట్టయినా, పుట్టగతులుండవురా నాయనా' అని చెవినిల్లు గట్టుకుని పోరి, కడపటికి కిష్టాయి చెవులు మెలేసి, దానం చేసిన ఆవుకని ఆరునెలల గ్రాసమిప్పించేదాకా నిద్రపోలేదెవరూ.

చిత్ర మేమిటంటే ఆవుని దానం చేశాంగదా చేసి దాన్ని గాలిలో వొదిలి ఊరుకున్నట్టయినా, దాన పరిగ్రహీత దివ్యచకోరంగానే వుంటాడు; ఎటొచ్చీ దానమిచ్చిన గృహస్తుమాత్రం అగ్గగ్గలాడవలసిందే చేతులు ముడుచుకుని కూచుందుకులేదు పీతాంబరం ఎరువిచ్చినమ్మ పీట వెంటబెట్టుకుని తిరిగినట్టు గోదానమిచ్చిన గోదాతకీ తప్పవీ ఆరళ్లు.

వీళ్లందరికీ గోరక్షణంటే ఎంత ప్రీతో తెలిసొచ్చింది కిష్టాయికి.

అప్పనంగావస్తే దాని పాలు పిండుకుని త్రాగి త్రేన్చేదీ, పేడకళ్ళు తీసి పిలకలకింద చరుచుకొని పొయిలో పెట్టుకునేది, దాని మొహాన ఇంత పసుపూ కుంకుమా పులిమి గడ్డీ తవుడూ కాదు 'ఆవు పవిత్రమయింది' అని లెక్చర్లు దంచేది!

'మెద్రాసులో ఆవులు మరీ పవిత్రమయినవి పుల్లిస్తరాకులు తిని పూటకి రెండు శేర్లు పాలిస్తాయి!' వేళ్లసందున సిజర్ సిగరెట్టుంచుకుని, నాలుగు రోడ్ల మొగని, నలుగురు స్నేహితులు మధా కిష్టుడిచ్చిన చిన్న ఉపన్యాసం చెవిలోపడి, నరసింహంగారు అగ్గిమీద గుగ్గిల మయిపోయారు.

* * *

సంచయనం

అనంతరం పిండప్రదానం జరిగింది.

కాకులు మెతుకులు ముట్టలేదు.

మదురుగోడమీద కొన్నీ, జామిచెట్టు పంగల కొమ్మలో కొన్నీ, బిక్కు బిక్కుమంటో కూచుని, నిక్కినిక్కి చూస్తున్నాయి; కాని ఒక్కటీ వాలదు.

జానకమ్మ చేతులు కట్టుకొని కన్నీళ్లు పెట్టుకొని పెరట్లో వసారవార నిలబడి 'దేవుడా

నాలోపమేమున్నది? పిల్లల్ని జాగర్తగానే చూస్తా తీరని కోరికలుంటే చెప్పు' అని దీనంగా వేడుకున్నది తీరిన కోరికలంటూ కొన్ని వున్నట్టు!

పిల్లల్నీ వచ్చి దణ్ణం పెట్టుకోమంది.

కిష్టాయికిదంతా నాటకఫక్కీగా వుంది. వీళ్లందరికీ అన్నాయి తాలూకు ఆత్మ ఈ కాకుల్లో దూరి అక్కడ పెట్టిన పిండాకూటికి అంగలారుస్తున్నదనే నమ్మకం గావును.

కిష్టాయినీ వచ్చి దణ్ణం పెట్టుకోమంది జానకమ్మ.

కాని, 'పిల్లలకేమీ అన్యాయం జరగదు' అని అన్నాయి ముందు అబద్ధం పలకబుద్ధి కాలేదతగాడికి. జరుగుతున్నదే అది.

'రోజూ కంచాలు కడిగేముందు, ఏవో నాలుగు మెతుకులు విదపడం గగనమయ్యేది ఇవాళ, ఓ చిన్న కుంభంకింద ఇంత వొబ్బిడిగా విస్తట్లోవుంచి హుష్మనకుండా, హూత్మనకుండా, ఇంత ఉదారంగా హఠాత్తుగా ఎలా మారిందా ఈ యింటో జనాభా పక్కపక్కల్ని ఏ నరాధముడైనా పొంచివున్నాడేమో దెబ్బతీసేందుకు' అని ఆ కాకిమూకకి సంకోచంగా వున్నదేమో గోల. మనిషిలో జీర్ణించిపోయిన టక్కుటమారీ విద్యలన్నీ మనుషులమధ్య మసిలే కాకిమూకకి మాత్రం గ్రాహ్యం కాకుండా వున్నయ్యా?

'కాస్త అంతా లోపలికి పదండి కిటికీల వెనకాలా, గుమ్మం పంచనా అలికిడి చెయ్యకండి' అని గద్దించాడు కిష్టయ్య.

'సోమయ్యకి తీరని మొక్కలేమైనా వున్నయ్యేమో.' అందించిందొక ముసలామె.

ఏమో ఎన్ని కష్టాలకి తలవొగ్గాడు; ఎన్ని ఆపదలు విరుచుకుపడలేదు!

కంపనబద్ధ కాకిలా ఎంత విలవిల్లాడాడు సంసారమీదుస్తో.

'ఏ మొక్కయినా కనీసం తిరపతి మొక్కయినా మొక్కకుండా వున్నాడో?' అని జానకమ్మకి అనుమానం సోకనే సోకింది.

కిష్టయ్యకి గుండె వేగంగా కొట్టుకుంది.

'అన్నాయి మొక్కని మొక్కులూ, మొక్కకండా వున్నాడా' అని లీలగా సంశయాస్పదంగా మొదలై చల్లగా రూఢికాబోతున్న మొక్కుబళ్లూ ఇలాంటి రుణాలూ, దస్తావేజులూ ఏమయినా 'పెండింగు'లో వున్నా రద్దుచెయ్యి మహాప్రభో' అని అన్నవరం సత్యనారాయణకో, సింహాచలం అప్పన్నకో, తిరపతి వెంకన్నకో, యాదగిరి లక్ష్మినరసింహస్వామికో ఎందుకైనా మంచిదని నవగ్రహాలకీ. మందపలి శనైశ్వరుడికీ మొక్కితే దేవుడు కాస్తాడన్న నమ్మకంలేని కిష్టాయికి మొక్కుబళ్ల వొత్తిడినుంచీ తప్పించమని వేడుకుంటే మొర వింటాడన్న నమ్మకం చిత్రంగా అంకురించింది.

యుద్ధంలో 'గ్రెనేడ్లు' విసిరినప్పుడూ, బ్రెన్‌గన్ ప్రేల్చినప్పుడూ, టపటపమని చెట్టుమీద

నుంచీ ఆకులు రాలినట్టూ, 'ఫౌన్‌టెన్‌లో' తుంపులెగిరి పడినట్టూ, తలకాయిలు విచ్చి రాలిన సిపాయిలని వేనకివేలు చూచాడు కిష్టయ్య. వాళ్లల్లో ముప్పాతిక మువ్వీసం అది దేశ సేవకింద లెఖ్ఖ అని రేడియో ఎంత గొంతు విచ్చుకొన్నా ఏదో దేశాన్ని ఉద్ధరించడంతో పాటు వొంటినిండా ఖాకీ గుడ్డలేసుకుని, కడుపునిండా పలావులు తిని, రాత్రిళ్లు మజాచేస్తూ చచ్చినా మాబాగే అని పొట్టచేత్తో బట్టుకుని రిక్రూటింగు ఆఫీసరు ముందు హాజరయిన బాపతేకాని, చచ్చింతరవాత గూడా ఈ పిండాకూటికని దేవురింపు మిగిలే వుంటుందని తెలిస్తే ఓ పట్టాన ఆ ఛాయలకే రారేమో. దరిద్రానికి ఝుడిసి, చావుకి తెగించినా తిండిరంధి తప్పకపోతే ఇహనేందారి!

* * *

నాలుగురోజులు గడిచినై.

కిష్టయ్య కొట్టుదగ్గరకివెళ్లి చెక్క తలుపులు తెరిచాడు.

కొట్టు కాస్త ఊరిబయటే అయినా, చుట్టు పక్కల గ్రామాదులకి సెంటరు లాంటిది. ఆ చిల్లర కొట్టుమీదనే సంసారమన్నేళ్లూ ఈదుకొచ్చాడు సోమయ్య.

చుట్టూతా ఖాళీస్తలం ఓ వెయ్యిగజాల మేరకి నలుచదరంగా వుంది.

దుకాణంలో దినుసులు పలచబడినై; ఉప్పుంటె పప్పులేదు; పప్పుంటే చింతపండు లేదు; చిల్లర సరుకులు ఒకటి దొరికి ఒకటి దొరక్కపోతే, అన్నీ దొరికే చోటికే పోతారు నలుగురూను.

అంతే జరిగింది.

పోపులడబ్బాలో అట్టడుగున మిగిలిన మిరపకాయలు...

'నాయనా కిష్టయ్యా అమ్మకాలు సాగుతున్నాయ్యా?' అని అడిగింది జానకమ్మ.

'అమ్మకాలేమిటీ? అసలు కొట్టే తెరుస్తుంటేనా? సరుకులేవీ?' అన్నాడు కిష్టయ్య హాలులో పచారుచేస్తూ.

'అన్నట్టు మొన్న దినకార్యానికని తెచ్చాం కింద వాడుకొన్నాంకదూ' అని జ్ఞాపకం వచ్చింది జానకమ్మకి.

'పోనీ కొత్తసరుకులు కొనలేకపోయినావా?'

ఇల్లు అయ్యవారి నట్టిల్లు అయిందన్న పయనమింకా ఆమెకి తెలిసిరాలేదు.

కొత్త సరుకులు కొనాల్నంటే డబ్బుకావాలనీ, డబ్బు ఖర్చయిపోయిందనీ, కానీ అప్పు పుట్టడంలేదనీ ఆమెకి తెలిసొచ్చేవరకు కొంత టయిముపట్టింది.

విడమర్చి చెప్పాడు కిష్టయ్య.

తీర్చేస్తోమతు సన్నగిల్లిన తరవాత, చేబదుళ్లయినా పుట్టవు.

సోమయ్య బ్రతికినన్నాళ్లూ గుంభనగా నడిచిన రథం, అతగాడు కన్నుముయ్యగానే, చక్రాలు విరిగినట్టయి, కిరకిరలాడుతున్నదప్పుడే.

ఇకపోతే, అంతవరకూ ఎవరికీ తెలీకుండా దాగివున్న రహస్యం ఏదీ ఆ కొట్టు మీద యింత రుణమున్నదీ అంత రుణమున్నదీ అన్న వయనం ఆగుబ్బుగా చెప్పుకుంటున్నారు నలుగురూ.

బర్రె ఛస్తే, అది ప్రొద్దుటేళ ఇన్ని పాలిచ్చేది, పయటేళ ఇన్ని పాలిచ్చేదీ అని ఇంటి యజమాని బావురుమనటంతో పైకి పొక్కుతుంది; కాని మనిషి ఛస్తే, ఆ శవంమీద దుర్వాసనకి ముందే అతగాడు చేసిన రుణాలు బైటికొస్తయి.

జానకమ్మ పెద్దమ్మాయి నరుసుని పొరుగింటికి బియ్యం బదులుకని పంపింది. ఆమె గడపదాటి బైట అడుగు పెట్టటంలేదు. పెనిమిటి గతించి ఇంకా నెలతిరగలేదు. తెగించి వీధిలోకి తొంగిచూచిందా, కొంప లంటుకుంటాయి. చూచి అసింటా తొలగిపోతారాయెను అమ్మలక్కలు.

అంచాత పెద్దమ్మాయి నరుసుని పంపింది.

'ఏదీ బియ్యామింకా తీసుకురాలేదుగా మా చిన్నాడేమో ఇదిగో అదుగో అని జాప్యం చేస్తున్నాడు' అని సాగదీసింది పొరుగింటి కామాక్షమ్మ. పక్కగదిలో... తలుపువారని... బియ్యంమూట ఆ పిల్ల కంటబడుతుందేమో కొంపతీసి అని... తురతుర బైట గుమ్మందాకా వొచ్చి మరీ తొంటచెయ్యి చూపిందామె. అసలు నరుసుని లోపలికి రానిస్తేనా?

జానకమ్మ వింటూనే వుంది.

ఇక ఆ చుట్టుపక్కల తనకి బదులు పుట్టదు గామాలు.

కిష్టయ్య సైతం చేబదుళ్లకని తడిమన్ను పొడిమన్నయ్యేలా తిరుగుతోనే వున్నాడు. ఒకచోట దొరక్కపోగానే ఇంకొకచోటకి వెళ్లాలిసివచ్చి, ఎక్కడా అప్పు పుట్టకపోగా, అప్పులకోసం కాళ్లు అరిగేలా తెగతిరుగుతున్నాడని చుట్టుపక్కల టాంటామయిపోయి, ఎవడికివాడు జాగర్తపడు తున్నాడు.

'అరె నిన్న అడిగితే పదేమిటి ఖర్మ పదిహేనిచ్చేవాణ్ణే' అని నాలిక కొరుక్కున్నాడు నారయ్య.

'అరె క్షణంకింద శంకరాన్ని అడిగి ఇరవై తెచ్చాను అవసరమై శంకరాన్ని కదిపి చూడు. నేను చెప్పానని నాలిక జారేవుస్మీ' అని ఉపాయాంతరం సూచించాడు ఉమాకాంతం.

'సరె నన్నే అడిగావూ? అసలేమిట్రా పరిస్థితీ... తణఖామీద ఏమాత్రం రుణం తెచ్చాడురా సోమయ్య? ఎక్కణ్ణించీ అంటా?' పైసా రాల్చకపోగా, కూపీలు తియ్యబోయాడు ఒకానొక లక్ష్మయ్య.

అసలు కిష్టయ్య అడిగే ధోరణిలోనే కొంత మిలిటరీ పద్ధతి అవుపించి, 'బదులివ్వకపోతే తన్నేలా ధిమాకీ చేస్తున్నాడు. తీరా ఇస్తే అది వసూలయ్యేవరకూ నమ్మకమేమిటీ' అని తప్పుకున్నారు కొందరు.

ఇలా కాదని కొట్టుమీద రావాలిసిన బాకీలే నరసింహంగారు వాడుకున్న బాపతు మూడు వందల చిల్లరవుంది. అది చేతికొచ్చినట్టయినా కొట్టు తెరవవచ్చును అవసరానికి ఆ మాత్రం సర్దలేకపోతాడా అనుకున్నాడు కిష్టయ్య.

మర్నాడు పైన తువ్వాలు వేసుకొని నరసింహంగారి బట్టలకొట్టు దగ్గరికి వెళ్లాడు కిష్టయ్య.

నరసింహంగారు విభూతి పెండెకట్లు సుదీర్ఘంగా పెట్టేసి పద్దుల పుస్తకంలో మునిగిపోయి వున్నారు కవుంటరు దగ్గర. చెవిలో యధాప్రకారం తులిశాకు పచ్చగా తొంగిచూస్తోంది. వజ్రప్పొడి వేసిన చిటికెనవేలి ఉంగరంలో, సీలింగుఫానుకింద, వెలుగునీడలు దోబూచులాడుతున్నాయి. చెవులనున్న వొంటిరాళ్ల దుద్దులు, ఆయన తలకదిపినప్పుడల్లా నక్షత్రాలల్లే మిలమిల మెరుస్తున్నాయి.

మందపాటి కళ్లద్దాల పై అంచులమీదనించీ షాపులోకివస్తున్న వాళ్లని కనిపెడుతోనే ఉన్నాడాయన. పక్కని గుమాస్తాలమీద ఓరకంట అజమాయిషీ చేస్తూనే ఉన్నాడాయన.

తూర్పుదిశగా, గోడలో అమర్చిన పింగాణి కూర్పు మందిరంలో, లక్ష్మీదేవి పాలరాతి విగ్రహం, అగరవత్తుల ధూపంలో, ధవళకాంతులతో నిగనిగ లాడుతోంది.

విష్ణు విగ్రహం ఆ ధరిమేనా ఎక్కడైనావున్నదా అని వెతుకుతున్నాడు కిష్టుడు. ఎక్కడా లేదు. ఆయన దేవేరి లక్ష్మీదేవికే అక్కడ పెద్దపీట అని స్ఫురణకొచ్చింది చట్టున.

ఆ దేవి రవ్వల వొడ్డాణమూ, మెడలో మణిమాలా పసిడివెలుగులు చెరిగిపోతున్నాయి. ఆమె నవ్వులపాలమీగడలు గదంతా పారాడుతో జమాఖర్చు పుస్తకాలలోకి తొంగి చూస్తున్నాయి... క్యాష్‌బాక్సులో గలగలలుగా మారుతున్నాయి.

గుమాస్తాలు వచ్చినవాళ్లని వరుసగా కూచోబెట్టి, తానులు విప్పి, ముందు కుప్పగా వేస్తున్నారు తమ చాకచక్యాన్ని లాభాలుగా మార్చి యజమాని జేబులోకి కనపడని తూరలంట పగడ్బందీగా వొంపేస్తున్నారు.

ఎద్దులు పాటుపడుతున్నాయి; గుర్రాలు గుగ్గిళ్లు తింటున్నాయి.

బీరువాలలో సిల్కులు టెరిలిన్లు టెర్రీకాటన్లు చీటీ గుడ్డలు నేతసరుకులు మడతలకింద ఆ తరవాత ముక్కలు ముక్కలుగా గుడిసెలలోకి కొన్నీ, మేడలోకి కొన్నీ, మిద్దెలలోకి కొన్నీ సరఫరా కావాలిసివున్నా అందాకా విడివిడిగా అరలలో మిడుతూ మిడుతూ ఒకదాని సరసన వొకటి కాస్సేపు సామ్యవాదం పాటిస్తున్నాయి.

నరసింహంగారు కిష్టాయిని చూచారు.

కిష్టాయి నన్నుమాటేవిటి ఆ ఆవరణలో వున్న అందరిమీదా ఆయన కన్ను పహారా ఇస్తోనేవున్నది అనటం సబవు.

అయితే, ఎవరిని సూటిగా చూడాల్సో, చూచీచూడనట్టు ఎవరిని వొదలాల్సో, అసలు

చూడనే లేదనట్టు ఎవరిపట్ల అభినయించాల్నో – అదంతా ఆయనకి హృత్కవిలె.

నరసింహంగారు కిష్టణ్ణి చూచివుండకపోతే, ఆయన నరసింహంగారే కాదు!

ఆయన కర్ణాకర్ణిగా విన్నాడు, కిష్టయ్య అప్పులవేటలో ఉన్నాడని.

అక్కడి కెందుకొచ్చాడో, అతగాడు గుమ్మంలో అడుగుపెట్టగానే గ్రాహ్యమయి పోయిందా యనకీ; తక్షణం అతనికి సమాధానం ఏమి ఇవ్వాల్నో నిర్ణయించుకోవడమూ జరిగిపోయింది.

ఇలాంటి చిల్లరమల్లర లావాదేవీలలో తలబ్రద్దలు కొట్టుకునే అలవాటు లేదు నరసింహం గారికి; ఆ సందర్భాలలో మెరుపు మెరిసినట్టూ, పాము పడగవిప్పినట్టూ, కొరడా ఛెళ్లుమన్నట్టూ ఆయన బుర్ర గభాల్న ఒక నిర్ణయానికొచ్చేస్తుందంతే.

డెప్టీ కలక్టరుగారి కారాగింది బైట. వారి సతీమణిని ఆహ్వానించేందుకు పద్దుల పుస్తకాలు ఎక్కడివక్కడ వొదిలేసి, చిరునవ్వులు గిలకరిస్తూ అలగం దొక్కేస్తున్నాడు నరసింహంగారు. పరధ్యాన్నంగా ఉన్నట్టు కనిపించిన గుమాస్తా నారాయణ్ణి ఒక్క కసురు కసిరారు. 'వారికేమి కావాల్నో కనుక్కొమ్మ'న్నట్టు ఆరణి పట్టుచీరల దగ్గర హడావుడిగా వున్న అంజయ్యకి కన్నుగీటారు.

ఆయన తనవంక పరాకుగానైనా చూస్తాడేమో తన ఘోష వెళ్లబోద్దామని రెడీగా నిల్చున్నాడు కిష్టుడు; పక్కపక్కల్ని వైదొలగి నిలుచున్నట్టయినా తనని అస్సలు పట్టించుకోకనే పోవచ్చునని పించి... వచ్చిన దగ్గర్నుంచీ... ఆయన ఎదటే... దేరా మేకల్లే టంఛన్‌గా నిలుచున్నాడు; కాస్త విరామంగా చిక్కగానే... దగ్గరికి జరిగి... గొంతు సవరించుకుని... చిన్న దగ్గుదగ్గి... ఆయన దృష్టిని ఆకర్షిద్దామని మల్లగుల్లాలు పడిపోతున్నాడు; కంచాలు కడిగే ముందు మెతుకెప్పుడు నేలమీద రాలుతుందా అని ఆసక్తిగా ఎదురుచూచే కాకిచూపు పడిపోయిందతగాడికి.

అసలు, కిష్టాయి వచ్చినట్టు ఆయనకి తెలియకపోతే కదా తెలియకపోతే, తెలియజెప్పడం అతి సులభం; కాని తెలిసీతెలియనట్టు అభినయించే పెద్దమనిషికి తెలియజెప్పడం ఎంత కష్టమో కిష్టయ్యకింకా తెలిసిరాలేదు.

అక్కడికీ తలకి చుట్టుకున్న గళ్లరుమాలు విప్పి భుజమ్మీద వేసుకున్నాడు కిష్టాయి. అలా చాలీచాలని రుమాలు చుట్టుకోవడం దాని అంచులు కుచ్చుతురాయల్లే పైకి వేళ్లాడ్డం రౌడి లక్షణాలని నరసింహంగారి అభిప్రాయం.

ఆమాటకొస్తే... నరసింహంగారికి ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. కొన్ని పోకిళ్లు ఆయనకి సుతరామూ నచ్చవు. అందులో ఇదొకటి.

ఇదివరలో ఆయనకి నచ్చుబాటుకాని కొక్కిరాయిచేష్టలేవో తెలుసుకుని, పనిగట్టుకొని అవే చెయ్యడంలో కిష్టాయికి కొంత సరదా ఉండేది. కాని, ప్రస్తుతం కార్యార్థిగా వచ్చాడు. కాస్సేపు ఖడ్గ వాదాన్ని వొదులుకున్నాడు. ఏ ఎండ కాగొడుగు పట్టాలికదా.

ఆయన ధ్యాసంతా పెద్దబేరగాళ్లమీదనే వుంది; తనా చిన్నబేరగాడయినా కాదాయెను.

షాపులోకివచ్చి, ఏమీ కానకుండా వట్టిచేతులతో ఎవరైనా నిష్క్రమించడం జరిగిందో, గుమాస్తాలమీద చిటపట లాడుతున్నాడు నరసింహంగారు.

అక్కడికీ గుమాస్తాలు మీటరయిదు రూపాయిలు చెప్పినప్పుడు, 'అబ్బా అంత ధరే?' అని ఆశ్చర్యార్థకాలు పలికిన ఆసామితో, 'మూడు రోజుల క్రితం ఇదే గుడ్డ ఆరున్నర కమ్మాంస్మండి' అని నచ్చజెప్పి ధరలు పడిపోయి, నిష్కారణంగా రూపాయిన్నర నష్టాని కమ్ముతున్నట్టు మొహంపెట్టీ, ఉచ్చులు బిగించేస్తూనే వున్నారు. మీటరు అయిదు రూపాయిల ధర చెప్పిన గుడ్డ నాలుగు రూపాయిలకి ఆసామీ అడిగితే, 'ఆరకమూ వున్నది,' అని చేతిలో వున్న పేటరన్ వొదిలేశి, మరో తాను విప్పిచూపి, ఆ పద్యవ్యూహంలోనించీ ఏ వొక్కడూ తప్పించుకు పోకుండా, అన్నివైపులా దిగ్బంధం చేస్తోనే వున్నారు శాయశక్తులా.

ఆశరికి ఎలాగైతేనేం నరసింహంగారి కటాక్ష వీక్షణం కిష్టయ్యమీద పడింది.

గుమాస్తా వ్రాసి చేతికిచ్చిన బిల్లేదో సరిచూస్తో, 'ఏరా కిష్టాయి, ఇలా వచ్చావు ఏమిటి కథ?' అని ఇష్టంగా నవ్వారు నరసింహంగారు. 'హమ్మయ్యనక్కనిదొక్కి వచ్చా' ననుకొని ఆయన పక్కని గొంతుక్కూచుని చంకనున్న ఖాతాపుస్తకం తెరిచి వచ్చినపని నివేదించుకున్నాడు కిష్టుడు.

అయితే, ఖాతాపద్దు మూడువందల చిల్లరా ఇమ్మంటావు?' అని మునివేళ్లతో గెడ్డం పుణుకున్నారు నరసింహంగారు.

ఆయన ముఖం ప్రసన్నంగా వున్నందుకు, తను దుర్ముహూర్తంలో రానందుకూ తనని తనే ఏక అభినందించుకున్నాడు కిష్టయ్య.

కాని కిష్టాయి పొరబడ్డాడు.

మిలటరీలో కత్తికికత్తి దూసి, ఎదురుపీకీన నిలిచి, పరపర పీకలు కోసెయ్యడ మెరుగును గాని కిష్టయ్యకి... పక్కవాటుగా కొంపలు ముంచే కార్యక్రమాలు సగమెరుక... ఇకపోతే, నరసింహంగారి లాంటి మోతుబరులు... తొంటచెయ్యిచూపే ముందు... ఎంత మర్యాదా, ఎంత మన్ననా ప్రదర్శించగలరో... అతని ఊహకందని ఉదాత్త విషయం.

నరసింహంగారికి రావలసిన బాకీలు రాబట్టుకుందుకు ఆయన స్వయంగా కలగజేసు కోవాలసిన అగత్యంలేదు. ఏ గుమస్తాలనో తరిమి, ఒకటికి రెండుసార్లు నిగ్గదీసి, రొక్కించి, అవసరమైతే నిలేసిమరీ ఒకవంక వసూలుచేసుకొంటోనే... ఇంకొక చెంపనించీ పలకరింపుతో గౌరవమూ, మర్యాదా నూటికి నూరుపాళ్లు పాటిస్తూ పొయ్యేందుకు... బోలెడంత సావకాశం మిగుల్చుకోగల వ్యవహర్త నరసింహంగారు.

కాని... ఆయన ఇవ్వాలిసిన చిల్లరబాకీలుంటాయి... కాఫీ హోటల్ అయ్యరికనీ, పాలవాడికనీ, దర్జీకనీ, కిరాణా వాడకాని కనీ... ఇది ఆయన ఇచ్చినప్పుడు తీసుకోవలసిందే... అంతేగాని ఎదుటబడి అడిగే దమ్ములెవరికీ లేవు.

నేటికి... కిష్టాయి... ఒక నస్మరంతి... ఖాతా పుస్తకం పట్టుకొచ్చి, 'చిల్లర వాడకం

కింద మీరింత బాకీ వున్నారు ఇస్తారా?' అని పోనీ... ఏదో లోపాయి కారిగా కాదు... పబ్లిగ్గా తనషాపుకొచ్చి అడుగుతాడా?!

తల కొట్టేసినట్టయింది నరసింహంగారికి.

అన్నం పెడితే అరిగిపోయింది. పంచేయిస్తే పిగిలిపోతుంది. వాడబడితే కలకలమూ ఉంటుంది అనుకున్నాడు నరసింహంగారు.

'సరే... మార్కండేయులూ... నోటు పత్రా... వసూలు వేద్దాం' అన్నాడు చట్టున.

'ఏ నోటూ?' నోరువెళ్లబెట్టాడు కిష్టయ్య.

'మొన్న ఎనిమిది వందలు పట్టుకుపోయావు గదుట్రా ఆ ప్రామిసరీనోటు... తరవాత తెల్లబోదువు గానిలే.'

కిష్టాయి కర్థమయింది.

ముందరికాళ్లకి బందంవేస్తున్నాడీయన. నోటుమీద వసూలు వేస్తానంటాడు ఖాతా బాకీ మింజువలె. ఆ మూడు వందలూ కళ్లజూడాలని వచ్చాడు తనూ... అది రొఖ్ఖం కింద చేతిలో పడితేనేగాని కొట్టు తెరిచేందుకు లేదు. కొట్టుతెరవాలి... కాస్త ఖాళీకుండలు డింకీలు కొడుతున్నాయింటో... క్లుప్తంగా పరిస్థితి ఏకరువు పెట్టాడు కిష్టయ్య.

బిగబట్టిన బంగారపు కట్టుడుపళ్ల సందుల్లోనించీ తెచ్చిపెట్టుకున్న నవ్వుని అంచులమీద బైటికి నెట్టి.

'ఒరే కిష్టా మీరేమో నాకు ఎనిమిది వందలివ్వాలి... అవునా? నేనేమో మీకు మూడువందల చిల్లర ఇవ్వాలి. కరెక్ట్... దరహమ్మీద ఇవ్వదేలేది నేను మీకా, మీరు నాకా? మిలటరీ లెక్కలు కడుతున్నావేమిట్రా?' అని చివాల్న లేచి జరుగురుపని వున్నట్టు, గబగబ లోపలికి చక్కాబోయారు నవసింహంగారు.

మిటిటరీ ప్రసక్తి రాగానే కిష్టాయికి బుస్సుమని పొంగొచ్చింది కాని తమాయించుకుని, 'పోనీ... ఇంకో మూడువందలు బదులు క్రిందనే ఇవ్వు బాబాయ్' అని అడుగుదామని నాలికదాకా వచ్చింది. సందు చిక్కకనేపాయె.

వెంట రావద్దంటే ఎత్తుకొమ్మని ఏడుస్తున్నట్టుంది తన అవస్థ.

గంటయింది. ఆయన ఊడిపడడు.

పెద్దగుమాస్తా మార్కండేయులున్నాడొక్కడే.

ముసిముసిగా నవ్వుకుంటున్నాడాయన.

రాతికుండలో ఇనపతెడ్డులాంటివాడు మార్కండేయులు. చూచిరమ్మంటే కాల్చివచ్చేరకం.

ఆయనతో చెప్పుకున్నాడు కిష్టాయి ఖాతా బాకీకీ, తన ప్రోనోటుకీ లంకె వెయ్యవద్దని.

ఆయన లోపలికి వెళ్లి సంప్రదించి వచ్చాడు.

'ఒరే కిష్టా... ప్రోనోటు మీద వసూలు వేస్తాట్ట... నీకు తెలియందేముందీ? క్యాష్ కళ్ల జూదామనుకుంటున్నావుగావును... నల్లమేకని బలేయి... కుదరదు... అయినా, వొరే నువ్వు ఇవ్వాల్సిన ప్రోనోటు అట్టేపెట్టి, నీకు రావలసిన చిల్లరబాకీ ముందుకు నెడితే ఆయనేమైనా మేధకుడనుకుంటున్నావా? మింగుడుపడే ఘటమేనా ఓ పట్టాన?'... అని కాస్త మందలింపూ, కాస్త హితోక్తీ మిళాయించి అన్నీ రంగరించిన శూన్యహస్తం అందించి చక్కాబోయాడు మార్కండేయులు.

కిష్టాయికి పచ్చివెలక్కాయి గొంతు కడ్డం పడింది.

ఏమో గోల... ఈ తిరకాసులన్నీ అతను గణితం వేసుకోలేదు ముందు... కొట్లోనా సరుకులు నిండుకున్నాయి... ఏవో నాలుగు దినుసులూ కొనిపడేస్తే, కొట్టు మూసిపెట్టకుండా వెళ్ల_మార్చుకోవచ్చును అని ఖాతాపద్దు చంకనెట్టుకుని వచ్చాడు... అంతే కాని... చెట్టంత మనిషి... నరసింహంగారంతటి వస్తాదుని... టోకరా వేద్దామని రాలేదు.

ఇదెట్లాగూ కొరుకుడుపడే వ్యవహారంకాదు అనుకున్నాడు కిష్టయ్య.

ఆమట్న రుమాలు తలకి చుట్టుకుని, ఖాతా పుస్తకం చంకనెట్టుకుని తిరుగుమొహం పట్టాడు.

కాళ్లకి చెప్పులు లేవు; వీధిలో అడుగుపెట్టగానే అరికాళ్లు చుర్రుమన్నాయి. మధ్యాన్నపు టెండ మిటమిట లాడుతోంది; నెత్తి చుర్రుమంది... నరసింహంగారిమీద సరేసరి అరికాలిమంట నెత్తికెక్కింది.

గాడిపొయ్యిలో కట్టెపుల్లలు పేలినట్టయి, కడుపులో నకనకలాడుతోంది.

మిలటరీలో వుండగా... సందు దొరికినప్పుడల్లా 'శకపారా' బిస్కట్లు టిన్నులమీద టిన్నులు కరకరా నమిలేసి; కాఫీహోటలులో చేరినతరవాత... జీతం తక్కువయినా, నోటికిమాత్రం అనుకోని రాజభోగాలన్నీ అమరిన కారణంగా... ఆకలితో అలమటించే రోజులు మరీ వెనకబడి పోయి... కొత్తగా కుంభకర్ణ నిద్రలో కుదుపొచ్చినట్టయి, పొట్టలో ఆత్మారాముడు పొలికేకపెట్టాడు.

కొంపకి చేరుకునేసరికి మధ్యాహ్నం రెండున్నరయింది.

ఇంటిదగ్గర జానకమ్మ తలుపు వారగా నిల్చుని 'ప్రొద్దుపొడవలేదు అదే పోకగా పోతివి గొంతులో కాఫీనీళ్లయినా పోసుకోలేదు... ఎక్కడికి వెళ్లావు కిష్టయ్యా?' అని లోపలికి నడిచింది.

కిష్టయ్య తలవాలేసి వెనకాలే నడిచాడు.

'నరసింహంగారి దగ్గరికి వెళ్లాను వదినా' అని ఉపక్రమించాడు కిష్టుడు.

జరిగిందంతా ఏకరువు పెట్టాడు.

'అయితే ఈ నరసింహంగారు మనల్ని పట్టి పల్లార్చుదామని చూస్తున్నాడే నేను విన్న భోగట్టాకీ నువ్వు పట్టుకొచ్చిన సమాచారానికీ సరిపోయింది' అంటూ మజ్జిగలోకి రుచి వడ్డించింది జానకమ్మ.

'నువ్వు విన్నదేమిటీ?' అని మజ్జిగన్నం కలుపుకుంటున్నవాడల్లా మధ్యలో ఆగిపోయాడు కిష్టయ్య.

తబిశీలుగా చెప్పింది జానికమ్మ.

'ప్రొద్దున్న నువ్వటు వెళ్లగానే పరంధామయ్య పలకరింపుకని వచ్చాడు.'

'పరంధామయ్య ఎవరూ?' కిష్టాయి జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

'ఎరగవూ... ఏనాడో కొట్టుస్తలమూ తణఖా పెట్టి మీ అన్నాయి రెండువేలు పట్టుకొచ్చారు చూడూ...'

'ఒహెూ... ఆయనా?... సరిసరి ఏమంటాడు? తీర్చమంటాడా... ఇప్పుడు?...'

'అదేమీ లేదనుకో... కాని ఆనోటు నరసింహంగారి పేర్న బదలాయించాట్ట ఈ మధ్య... విన్నారా?'

'నరసింహంగారి పేరనా?' కిష్టుడికి నిలువు గుడ్లు పడిపోయాయి కాసేపు.

మెతుకులు మునిపంట కొరుకుతో ఆలోచనలో పడ్డాడు.

జానకమ్మ చెప్పుకుపోతున్నది.

'పరంధామయ్యకి జరుగురుగా ఒక వెయ్యి రూపాయిలు కావాలిసొచ్చి నరసింహంగారి నడిగాట్ట. 'వెయ్యేమిటి ఖర్మ మూడువేలిస్తాను... ఆ తణఖా నోటు నా పేర బదలాయించు' అన్నాట్ట నరసింహం. ఆమట్న పరంధామయ్య ఎగిరి గంతేసాడు. వెయ్యదూ? పారుపద్దనుకున్నదీ, కోర్టు కెక్కి రొంపలోకి దిగితేగాని పైసలు కాదనుకున్నదీ... కటికిముడి విడిపోయినట్టు... కరుకులు చేతిలో పడుతుంటే... సిరిరా మోకాలొడ్డే దెవరూ? 'సరే'నని అసలీ ఫాయిదాలతోసహా వేయించు కొని నోటు బదలాయించేశాట్ట. ఇది కథ."

ఇంతకీ ఎందుకింత పనిగట్టుకుని నరసింహంగారు తనఖానోటు తన పేర బదలాయించు కున్నట్టు? నరసింహంగారు తీస్తున్న గొయ్యి ఎక్కడో అంతు బట్టలేదు గాని, పలుగుచప్పుడు మాత్రం పదే పదే మోగింది ఇద్దరి గుండెల్లోనూ.

సావిట్లో కాలు విరిగిన ముక్కాలిపీటమీద, గెడ్డం చేతిలో పెట్టుకుని, వీధిలో దొర్లిపోతున్న సైకిళ్లనీ, రిక్షాలనీ అలవోకగా చూస్తున్న కిష్టాయికి, ఆపక్క గోరింటవారి సందులో గోళీకాయ లాడుతున్న విస్సాయి కనిపించాడు. ఒక చెంపనించీ వాణ్ణి పిలుస్తూ, 'వీడు స్కూలుకి వెళ్లలేదేమీ?' అని వాకిలి ఊడుస్తున్న జానకమ్మ నడిగాడు కిష్టుడు.

'వాడు స్కూలుకి వెళ్లటం లేదు నాయనా' అంది జానకమ్మ తల ఎత్తకుండానే.

'ఏం?'

'పేరు కొట్టేసారు.'

'అదేమిటి?'

'జీతం మూడు నెలలు బకాయిపడింది. ఎన్నింటికని చావను?'

కిష్టాయి మనస్సు చివుక్కుమంది.

నిజానికి తనూ గోళ్లు గిల్లుకుంటో, సుష్టుగా భోంచేసి, మత్తుగా నిద్రపోతున్నాడింత వరకూ.

'నన్నడగలేదేమీ?' అని ముదలకిస్తో బైటికి నడిచాడేగాని... అడగ్గానే డబ్బెక్కణ్ణించి ఊడిపడుతుందో ఆమెకి తెలియదు గనకనా.

జానకమ్మ అయోమయంలో పడిపోయింది.

కొట్టా నడపడం లేదు; ఇంటోనా బియ్యం సమేతూ అన్నీ నిండుకున్నాయి; ఈ దినకార్యం పేరు మీద బదులతెచ్చిన ఎనిమిదివంతులూ తుడిచి పెట్టుకుపోగా, అక్కడక్కడ పలచపలచగా అప్పులు మినహా మిగిలిందేమీ లేదు; కిష్టయ్య తెలిసినచోటల్లా చేబదుళ్లడిగి లేదనిపించుకుంటు న్నాడు. ఎట్లొచ్చీ చిల్లరబాకీలు రెండురూపాయలూ, మూడురూపాయలూ చెదురుమదురుగా చేతికివస్తుంటే నాలుగు రోజులనుంచీ నాలుగువేళ్లూ నోట్లోకి పోతున్నాయి. కాలునిలద్రొక్కు కుందుకు సావకాశం చిక్కకనే పాయెను... కూచుని తింటుంటే గుళ్లూ గోపురాలూ ఆగేనా?

ఇప్పుడిహ నేమిదారి?

కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ కూచుంది జానకమ్మ; అయ్యో ఈ పిల్లలు అన్నంలేక మలమల మాడి, ఆకలికి విలవిల్లాడిపోతారు గావును.

పరలోకంలో ఉన్న భర్త కళ్లెర్రజేసి చూస్తున్నట్టు వొణికిపోయింది జానకమ్మ.

ఏదో, తన మానాన తను సంప్రదాయమో చట్టుబండలో, గౌరవమో, నామోషీ అనుకో కుండా, అన్నయ్యకీ బరువు తగ్గిద్దామని, ఇక్కడయితే మొహంచెల్లక, పరాయిచోట, కాఫీహోటల్లో సర్వరుగా అయితేనేమిగాక, ఏదో ఒక అయ్యపంచని పొట్టబోసుకుంటూ కడుపులో చల్ల కదలకుండా కాలక్షేపం చేస్తున్నాడు మరిది. తనెక్కడున్నదీ చెప్పకుండా పదీపరకా అడపా తడపా పంపించేవాడుకూడా. అతన్ని తీసుకొచ్చి, ఈ కొంప శ్రాద్ధమంతా తలకెత్తి తన పిల్లల సంరక్షణకని ఇక్కడ కట్టి పడేసింది తను. తను చెడిందిగాక వనమెల్లా చెరిచిందన్న సామెతగా తను దరిద్రంలో మునిగిపోతూ, అతన్నీ ఈ ఊబిలోకి దించినట్టయింది. క్రియకి, దరిద్రుడికి తల కడగబోతే వడగళ్లవాన వచ్చిపడింది.

తన ఖర్మకాకపోతే మొదటి సంతానం ముగ్గురూ ఆడపిల్లలే కావాలీ తనకి... అక్కడికీ... 'ఒకళ్లేమన్నా ఖాతరు చెయ్యకండీ... ఆపరేషను చేయించుకోండీ' అని శతపోరింది తను. 'ఒక్క మగ నలుసయినా లేకపోయెను. వంశవృక్షానికి గొడ్డలిపెట్టు పెడతావుటయ్యా?' అని పాచిపనిచేసే లచ్చువమ్మ లగాయతూ పండితశాస్త్రిదాకా హెచ్చరిక లిచ్చినవారే!

సిద్ధాంతి చిదంబరం, సరేసరి, "పుత్" అనే నరకాన్నించి తప్పించుకోవాలంటే పుత్ర సంతానం అవశ్యమూ పొందలేనయ్యా' అని సోమయ్యకి నూరిపోసి, ఆ నరకం ఒక పెద్ద పులివతుగా తన కోసమెట్లా నోరు తెరుచుకుని కూచున్నదీ, దాని కోరలూ, కోరలవంపులతోసహా వర్ణించి చెప్పాడు.

పోనీ ఒక్క మగ నలుసుని ప్రసాదించాడు కదా భగవంతుడు, ఇకనైనా బుద్ధి వచ్చిందా అంటే... అబ్బే... అదీలేదు.

ఒక కన్ను కన్నుగాదు ఒక కొడుకు కొడుకు కాదన్నారు. ఆడపిల్లలు బేసిసంఖ్యలో ఉండకూడదన్నారు.

ఈ అన్నవాళ్లెవరూ ఒక గిద్దెడుబియ్యం బదులివ్వరివాళ.

అంతేనా ఈ తలుపుల వెనకాల మ్రగ్గుతున్న దరిద్రానికి ఝడిసి అసింటాపోతున్నారు.

పెళ్లి కెదిగున్న ఆడపిల్లల గోడే పట్టలేదామెకి. మింగమెతుకులేదు మీసాలకి సంపెంగ నూనె ఎక్కడిది? మొదలు పొట్టగడిచేమార్గం మూసుకుపోతున్నది, పెళ్లి పెడాకులూను!

* * *

కిష్టయ్యా ఆ పోకపోక రాత్రి పదింటికి తిరిగి వచ్చాడు. వస్తోనే రెండుశేర్లబియ్యమూ, కసిన్ని పప్పులూ గట్టా పట్టుగొచ్చాడు. చిల్లరబాకీలు వసూలుకాలేదు. పుస్తకం ఇంట్లోనే వుంది. ఎక్కడిదీ డబ్బు అని అడుగుదామనుకుంది జానకమ్మ. కాని రాత్రి రెండు ఝాములు కావస్తోంది.

వస్తోనే, "నరసింహంగారు మన నరుసుకి సమందం తీసుకొస్తున్నారు వదినా" అన్నాడు స్నానానికి తుండుగుడ్డ వెతుక్కొంటో.

తండ్రిపోయిన మూడునెలలలోపుగా కన్నెచెర వదిలిస్తే పుణ్యం కూడానట. కాని మురిగి పోతున్న ఈ దరిద్రపు కొంపలోనించీ సమంధం అందుకొనే తల మాసినవాడెవడా అని జానకమ్మ విస్తుపోయింది.

కిష్టయ్య విడమరిచి చెప్పాడు.

మద్దుల మాణిక్యంగారని... రాజాపేటలో... ఫ్యాన్సీ వ్యాపారంట... ఆయనా సోమయ్యా జాయింటుగా ఏదో వ్యాపారం వెలిగిద్దామని... భుజాలు రాసుకున్నారట కొన్నాళ్లు... ఏనాటి మాటో... ఇప్పుడు లక్షాధికారట.

"ఇంతకీ వాళ్లబ్బాయి ఉన్నాడా పెళ్లికి?" అంది జానకమ్మ యధాలాపంగా వాళ్లు

లక్షాధికారులన్నమాట మరిచిపోయి.

పీటమీదవున్న విభూతిపండు తీసి క్రింద పెట్టాడు కిష్టయ్య. విభూతి అంటే అతనికి తగనిమంట.

"అబ్బే ఆయన కొడుక్కికాదు. ఆయనకే."

"సరిపోయింది రెండోపెళ్లా?"

"మరేమనుకొన్నావు? ఇద్దరేట ఆడపిల్లలు... పాపం... మగసంతానంలేదుగా... అందుకని మళ్లీ నడుం బిగిస్తున్నాడు."

ఆయన్నీ పున్నామ నరకం బెదిరిస్తూనేవుంది గావును పీడ.

నరసింహంగారు సమంధాలు చూస్తున్నారు అనగానే అనుకుంది జానకమ్మ, 'ఇంతకన్న సౌదభ్యంగా అహోరిస్తుందీ' అని.

అయినా ఆమెకీ దిగులే.

ఇంతకన్నా కట్నం లేకుండా చవకబారుగా తన కుమార్తెని కట్టుకోవడానికి సిద్ధంగావున్న వరుళ్లు బజార్లో క్యూలో నిల్చోవచ్చారా? తక్కువ నోములు నోచి ఎక్కువ ఫలాలు కావాల్నంటే ఎక్కణ్ణించీ వస్తయి?

అదీ అయింది.

అదిగో ఆ పచారి కొట్లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు కురిచేటివాటి కూర్మయ్యని... అతగాడికి నెత్తిమీద జుట్టు మినహా వెనకాల ఆస్తిలేదు; తల్లి లేదు; తండ్రి లేడు. పోతే ఆ దేవయ్యకి నెలకి యాభై జీతం!... అవునా రెండువేల కట్నం దమ్మిడీకి మారదు. దరిద్రం తర్లివెళ్లి దరిద్రాన్ని కౌగిలించుకునేకన్నా... కాళ్లదగ్గర కొస్తున్న సమంధం... రెండో పెళ్లి అయితేనేం గాక... ఇంత తిని, ఇన్ని నగలు పెట్టుకొని... గరగరలాడే చీరలు కట్టుకొని... గుమ్మటంలా నాలుగుకాలాలపాటు మసిలితే చాలదాయేం? ఆడ కూతురు కంతకన్న ఏం కావాలి?

'మూన్నాళ్ల ముచ్చట' అని అమ్మలక్కలు మూతి విరిస్తే అయిందా?... ఈసురోమంటూ, వరాల కింద దేవుడిచ్చిన బిడ్డల్ని శాపాలనుకొని మోస్తో బండలమీద బ్రతుకు లీడ్చుకొంటూ వందేళ్లు బ్రతకాల్నా యేం?

'పడుచుపెళ్లాం ముసలి మొగుడూ' అని బుగ్గలు నొక్కుకోనీ నలుగుర్నీ... నెలకి యాభై తెచ్చుకొంటూ తెగనీలిగే ఈ దేభ్యం ఏమాత్రం తిననూ, ఎంత బట్ట కట్టనూ, పెళ్లాన్ని ఎంత హుందాగా పోషించనూ, ఎంత మొగసిరి వొలకబొయ్యనూ!

మద్దుల మాణిక్యం... రెండో పెళ్లి అన్న మాటేగాని ముప్ఫయిరెండు మించదు వయస్సు... కాయసారు శరీరం... జానకమ్మ ఎరుగును... హయ్యోరాత... మొగుడూ మొద్దులూను... ఈ అంద చందాలూ... ముద్దుముచ్చట్లూ... పెళ్లయిన నాలుగేళ్లు... కాదంటే అయిదు... ఈలోగా

ఒకళ్లిద్దరు పిల్లలు పుట్టుకొచ్చారా... ఇక మగనాలి అందం మొగుడిక్కావాలా? పెనిమిటి శృంగారం పెళ్లానిక్కావాలా?... ఆ తరవాత... ఏదో... గింతలు కట్టిన గానుగెద్దుల్లా... శనగలు తిని చేతులు కడుక్కున్నట్టు...

అంతవరకూ సంసారపు సుడిగుండంలో జానకమ్మ రుచి చూచిన విలువల ఆంతర్యాలు అంతంత మాత్రం!

కిష్టయ్యకి ఈ రకమైన ఆలోచనా సరిణి పరమ అసహ్యం.

అసలు పెళ్లిచేసుకున్నాడా మనిషి సగం.స్వార్థపరుడూ, సంకుచిత మనస్వీఅయి చక్కా వూరుకుంటాడు. తప్పదు. ఇక సంతానం లుకలుకలాడుతూ బయల్దేరిందా, కక్కుర్తీ, కుళ్లూ, ఒకదానివెంట ఒకటి చోటు చేసుకొంటాయతనిలో... అన్నంతగా ఆలోచించడమే చప్పగా మానుకుంటాడు. ఇది డబ్బులేనివాళ్ల తీరేకాదు; కలవాళ్లూ ఇదే తంతు. ఏదో డిగ్రీ తేడా అంతే... అంచాతనే... ఛస్... ఈ విషచక్రంలో అసలు ఇరుక్కోనే గూడదూ అని పెళ్లికే ఎగనామం పెట్టేశాడు కిష్టయ్య. అయితే... ఇది... తనకి పిల్ల నెవరూ ఇవ్వకపోగా తీసుకున్న నిర్ణయంమాత్రం కాదు... కావాల్నంటే గంతకుతగిన బొంత, ఏ జీడిపిక్కో, ఈ బొద్దింకో, ఏ బొంతకాకో తనకి అమరకపొయ్యేది కాదు తాను అవునని తలవూపినవాడు... కాని, జీవితాన్ని అంత తక్కువ వెలకి అమ్మేసుకుని, పరువూ ప్రతిష్టా కొనుక్కుందుకు మనస్కరించలేదు కిష్టాయికి. దాన్దుంపతెగా... ఆ రెండుభ్రాంతులూ వొదులుకున్నట్టయినా, నీతి నిజాయితీలు గీచిన గిరి దాటనే అఖ్ఖర్లేదు... బోలెడంత సుఖశాంతులు నొల్లుకోవచ్చును. 'ఎద్దయి కాడికింద ఏడేళ్లు బ్రతికేకన్నా, ఆంబోతయి ఆరుఘడియలు బ్రతికితే చాలదే?' అంటాడు కిష్టయ్య.

కాని కిష్టయ్యకి గాలిలో మేడలు కట్టుకొని, దానికి రంగువేసుకొంటో కూచునే అలవాటులేదు. నేల విడిచిన సామంటె అతనికి సుతరామూ గిట్టదు. వాళ్లేమనుకుంటారో... నలుగురూ నవ్విపోతారు... 'నలుగురితో నారాయణా కులంతోపాటు గోవిందా' ఇలాంటి సూక్తులు ఉరితాళ్లక్రింద లెక్క అతనికి.

కిష్టయ్య ఆ రోజు లగాయతూ ఇంట్లో కావలసిన సామాగ్రి, కూరా నారా, ఏరోజు కారోజు పట్టుకొచ్చి పడేస్తూనే వున్నాడు.

వసూలవుతున్న చిల్లరబాకీలు కావు.

ఎక్కడిదీ డబ్బు?

జానకమ్మ కంతుబట్ట లేదు.

విస్తళ్లు కుట్టీ, అప్పడాలొత్తీ, ఊరగాయలమ్మీ వేన్నీళ్లకి చన్నీళ్లుగా యధాశక్తి గడుపు కొస్తున్నది జానకమ్మ.

* * *

మానవజీవితం తమాషాగా వుంటుంది. ఎవ్వడూ తిండిలేక చచ్చిపోడు, చచ్చిపోతున్నట్టు

అవుపించడు... అలా లెక్కకి రానేరాడు మన సామాజిక వ్యవస్థ సృష్టించిన ఇంద్రజాల మట్లాంటిది... ఆ నాగరికతలో దరిద్రుడు ఠపీమని చావడు. మెల్లి మెల్లిగా చస్తాడు... ఘడీఘడీకీ, రోజురోజుకీ, కాస్త కాస్త చచ్చిపోతో, ముఖ్యంగా... జమాబందీ వాళ్లకి... నిజంగా బ్రతికున్న శాల్తీలక్రిందనే లెక్కకొస్తారు.

* * *

'విన్నావా అమ్మాయీ?'

ఎప్పుడొచ్చాడో ఏమో, సావిట్లో బెంచీమీద తాపీగా కూచున్న నరసింహంగారి మాటలకి అదిరిపడింది జానకమ్మ. విస్తళ్ల చిటుకూ చిటుకూ కుడుతున్నదల్లాలేచి, ఈనపుల్ల వొదిలేసి, పైటకొంగు మెడమీదనించీ ముందుకి విరుచుకుని, తలుపుచాటుకివెళ్లి 'ఏమిటయ్యా?' అంది.

నరసింహంగారు బకాసురుడల్లే కూచున్నాడు యధాప్రకారం... చెవిలో తులసీదళమూ... నొసట విభూతిరేకులూ తిథి వార నక్షత్రాలన్నీ కలిసివస్తేనే గాని క్షురకర్మ నిషేదం నరసింహం గారికి... అంచాత గెడ్డం కాస్త మాసింది.

'మన కిష్టయ్య వ్యవహారం విన్నావా?' అని రెట్టించారు నరసింహంగారు.

'ఏదో కొంప మునిగింది,' అనుకొన్నది జానకమ్మ... ఈ మరిది మళ్లీ ఏమి జట్టీ తీసుకొచ్చాడో!

'ఏమి చేశాడన్నాయ్?'

'మూటలు మోస్తున్నాడు! ఈ నాటికి మన వంశంలో!... భేషుగ్గా వుంది కదూ?'

'మూటలా? ఎక్కడ?'

'బస్సు స్టాండులో.'

జానకమ్మకర్థమయింది.

ఇంటో కావలసిన వెచ్చాలు ఎప్పటికప్పుడు కొని పడేస్తున్నాడు... కొట్టు తెరుస్తున్నాడేమో అనుకొంది తనూ.

ఇదన్నమాట చేస్తున్న నిర్వాహకం.

'అయితే నీకు తెలియదా అమ్మాయి?'

'హయ్యోరాత... తెలిస్తే ఆ పని చెయ్యనిస్తానా అన్నాయ్?' అని కంట తడిపెట్టింది జానకమ్మ.

ఆమట్న విజృంభించాడు నరసింహంగారు.

'వీడున్నాడు చూశావూ... వీడు ఈ కిష్టాయి... అసలు వీణ్ణి గడప తొక్కనియ్యడమే తద్దినం కొని తెచ్చుకోవడమనుకో... మీ కొంపకి వీడొక శని... నామాట నమ్ము... అసలే

మిలిట్రీకి వెళ్లివచ్చాడా? అది చాలక కాఫీహోటలులో కప్పులు కడిగాడు... ఇప్పుడిహో బస్సుస్టాండులో ట్రంకులు మోస్తున్నాడు... ఇక మీకుగాని, మిమ్మల్నిబట్టి నాకు గాని... పరువేముంటుంది చెప్పు?... రేపు అమ్మాయి పెళ్లికున్నదా? ఎవరైనా ఏమయినా అన్నారూ అంటే అనరూ? ఆ మాణిక్యం... మన పెద్దమ్మాయి సమంధానికి దిగివస్తున్నాడూ అంటే... 'మా వాళ్లు' అని నేను నచ్చజెప్పబట్టి కదా? ఈ త్రాష్టుడు పెళ్లికి పిన తండ్రి అవుతాడు అని తెలిస్తే... మూటలు మోసుకునే చట్కారీ సంప్రదాయమని తెలుసుకుంటే... మరింక ఈ ఛాయలకి వస్తాడా? ఈ సమంధం మాట అలా వుంచు... ముందుముందు ఏ సమంధమయినా ఎక్కేనా ఆలోచించు? నీకు... మనలో మన మాట... డబ్బా దస్కమా... పొలమా పుట్రా... మేడలా మిద్దెలా... ఉన్నదల్లా పరువూ ప్రతిష్టా!... చచ్చి ఏలోకాన వున్నాడోగాని ఏనాడయినా ఇలాంటి నికృష్టానికి వొడిగట్టాడా?'

ఆ ధాటీకి జానకమ్మ నిశ్చేష్టురాలయింది.

ఒక చెంపని తనకోసం మరిది ఎంతటి అఘాయిత్యానికి ఒడిగడుతున్నాడా అని మనస్సు వ్యాకులపడుతుంటే, సందు దొరికిందిగదా అని ఈయనగారు వొంటికాలిమీద లేస్తున్నారు అతగాడిమీద.

ఈయన ధోరణి చూస్తే, ఆ మాణిక్యంగారి సమంధం రెండో పెళ్లి అయితే అయింది పీడాబాయిరి అని తను ఒడంబడినా... అదీ పడనిచ్చేలా లేడీయన. మాణిక్యంగారి సమంధమన్న మాటేమిటి? ఉత్తరోత్తరా... ఏ సమంధం వచ్చినా... పని గట్టుకుని... సందర్భంరానీ రాకపోనీ... కిష్టయ్య సంగతీ... బస్సుస్టాండులో మూటలు సంగతీ... చెప్పి మరీ తిప్పగొట్టేలా వున్నాడీయన.

ఈ నరసింహంగారిని 'ఉపకారి' అని మన్నించేందుకులేదు... 'అపకారి' అని దూరంగా ఉంచేందుకు లేదు... ఆయన పెద్దరికమట్లాంటిది.

కిష్టయ్యని సమర్ధించనూలేక, నరసింహంగారి సమక్షంలో అతణ్ణి ఆడిపొయ్యనూలేక, మెదలకుండా ఊరుకుంది జానకమ్మ.

నరసింహంగారు కారాలూ మిరియాలూ నూరుతున్నాడు కిష్టుడిమీద.

'ఏడి వాడు?' అంటున్నాడు ఎక్కడున్నాడో తెలిసీ కూడా.

అసలు నరసింహంగారెప్పుడు వస్తారా అని ఎదురుచూస్తోంది జానకమ్మ. వెతకబోయిన తీగ కాళ్లకి తగిలినట్టయింది.

చూడబోతే ఇంటా బయటా సంసారం నీళ్లుగారి పోతుండెను.

'ఆ కొట్టు కాస్త నడిచే సాధనం చూపించన్నయ్యా' అని నోరు విడిచి అడగనే అడిగింది.

నరసింహంగారు ఆ దెబ్బతో సీరియసయిపోయారు.

'ఆ కొట్టుమీదనే మరొక నాలుగు వందలు సర్దు అన్నయ్యా. కొట్టు నడిచిందా బ్రతికి

పోతాము. ఈ ఇల్లు నిలబెట్టి పుణ్యం దక్కించుకో అన్నాయ్' అని ప్రాధేయపడింది జానకమ్మ.

ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా చెప్పుకుపోతున్నారు నరసింహంగారు.

అమ్మాయీ... నీ తప్పులేదు... లోకులనుకుంటున్నట్టే నువ్వూ అనుకుంటున్నావు... ఏమనీ? నా దగ్గర డబ్బు మూలుగుతోందని... సరే... అదలావుణ్ణీ... ఆ కొట్టుమీద ఈ వరకే తణఖామీద రెండువేలపైన రుణమున్నదాయెను... కిష్టయ్య వ్రాసిన ప్రోనోటు ఒకటుండెను. ఇప్పుడు మళ్లీ తేతెమ్మంటుంటివి... ఇవన్నీ ఎప్పుడు తీరేను? ఎలా తీరేను? ఏమయినా ఆలోచించావా అమ్మాయి?' అని ఇబ్బందిగా మొహం పెట్టాడు నరసింహంగారు.

ఏదో సహాయం అందించేలానే వున్నాడీయన అని పేరాశ గుడగుడలాడింది జానకమ్మకి.

తనా ఆడది! ఆయనా ధక్కా మొక్కీలుతిన్న వ్యవహర్త! ఎంతకీ ఆంతర్యమివ్వడు. అసలు తనో లెఖ్ఖాపత్రమా? కిష్టయ్యకే అంతుబట్టడీయన. అయితే అతగాడు ఏ గరిగమ్మ వాటంగానో మెలితిప్పి కుండబద్దలు గొట్టించి లవుక్యాల మడతలలోనించీ అసలు రంగు బైటపెట్టించగలడు.

ఇక నరసింహంగారు... పోతో పోతో సోమయ్య చేసిన రుణాన్ని గురించీ, కొట్టుమీద తణఖాబాకీ పేర్చిపెడుతున్న వడ్డీని గురించీ, ఇతరత్రా చిల్లర మల్లరగా పేరుకుపోతున్న చేబదుళ్లని గురించీ, కావాలిసిన పెద్దమ్మాయి పెళ్లిని గురించీ, ఆ తరవాత ఎంతకీ తెమలని సంసార లంపటాలని గురించీ ఆమెకి తెలిసిన వివరాల్నే అతిగా వర్ణించి చెబుతో... ఉన్న పరిస్థితిని అన్ని వేపులనించీ భయంకరంగా చిత్రించి చూపుతో... నాలుగువేపులా ఇల్లంటుకొన్నది చూశావా అని వార్నింగులు వొదులుతో... ఇలా కమ్ముకొస్తున్న ఆపత్తునుంచీ బైటపడాలంటే తను కాస్తా కూస్తా బదుళ్ల రూపేణా విదుపుతోపోతే చక్కబడే వ్యవహారంకాదనీ... చదువుకుపోతున్నాడు.

'దానికన్న' చప్పున ఆగాడు.

'మరేమి చెయ్యమంటావన్నాయి? ఎటుగూడీ అదిగో ఆ చిన్నకొట్టూ, స్థలమూ ఉన్నాయి. దానిమీదనేగదా ఇన్నాళ్లూ ఇంత కామాటమూ ఈడ్చుకొచ్చిందీ... ఒక్క యేడు కళ్లుమూసుకుంటిమా రుణమూ తీరవచ్చును...'

'అదే నీకు పట్టుకున్న పిచ్చి.' ఎగిరిపడ్డాడు నరసింహంగారు.

'కొట్టూ కొట్టూ కొట్టూ! దాన్ని కౌగలించుకుని కూచుంటే తేలే వ్యవహారమేనా ఇది! అవ్వా కావాలి బువ్వా కావాలంటే ఎలా? పోసే చమురు తక్కువాను, వేసేపత్తి పెద్దదీను. దాన్ని దోస్తో కూచుంటే ఏమయినట్టు? ఆకాశమంటే ఆకలీ, సూదిబెజ్జమంత నోరూను మీకు! తోచదు చెబితే అర్థంకాదు. ఆ కొట్టు అమ్మరాదా అంటాను రుణాలుపోను రెండు మూడు వేలు చేతికొస్తయి గదా ఎక్కడైనా ఒక చిన్నగది అద్దెకు తీసుకుని కిరాణా దుకాణం నడుపుకోవచ్చును కదా. మరి అమ్మాయి పెళ్లికున్నదా? కట్నం లేకుండా కిఫాయితీగా అమిరిందే అనుకుందాము. వచ్చిన వాళ్లకి అరుగులమీద చింకి చాపలన్నా వెయ్యాల్నా? శాస్త్రానికి అల్లుడికి అంగవస్త్రమయినా చదివించాల్నా? ఇవన్నీ ఎక్కడించీ పుట్టించగలవు? చెప్పు. దారీ డొంకాలేని ఆలోచనలు చేస్తుంటే

గట్టేక్కేనూ వ్యవహారం?' అని బైటపడ్డాడు నరసింహంగారు చివరికి.

జానకమ్మ గుండె గుభిల్లుమంది.

ఆ కొట్టూ స్థలమూ మింగుదామనుకుంటున్నాడీయన... దానిమీద ఉండుకున్న తణఖా బాకీ తన పేర ఎందుకు బదలాయించుకున్నాడో ఇప్పుడు బాగానే అర్థమయిందామెకి... ఒక రవ్వ కాల్చుమంటే వొళ్లంతా వాతలు బెట్టేలా వున్నాడు దుర్మార్గుడు.

తనకున్నది చాలదు గావును మళ్లీ కట్టుకు పోయినంతవుంది మూడు తరాలకి సరిపడా... ఎక్కి దొక్కేను... అదంతా ఇతగాడి ఏనుగు దాహానికి చూరునీళ్లు!

డబ్బుదాహం తామరలాంటిది; గోకినకొద్దీ దురద పెడుతుంది.

జానకమ్మ కాస్సేపు నసిగింది.

'ఆకాస్త ఆధారమూ వొదులుకుని ఏ గంగలో కలవనూ?' అంది. 'అదేకదా ఇన్నాళ్లూ శ్రీరామ రక్షగా వున్నదీ' అని వాపోయింది.

కాని రాతి ప్రతిమకి చక్కలిగింతలా? నెమలికంట నీరు పెడితే వేటకాడికి జాలా?

నరసింహంగారు విసుగ్గా మొహం పెట్టారు.

'నీ ఇష్టమమ్మాయీ. పెద్దవాణ్ణి కాబట్టి. నువ్వు నీ ఆస్తులమ్ముకుంటే నాకేమి వొరిగేను?... కిష్టాయితో ఆలోచించు... వాడి ఆలోచనే నీకు నచ్చుతుందిలే... నీ యంతట నువ్వు ఒక నిర్ణయానికి రాలేవని నాకూ తెలుసు.' నానుస్తూ ఎద్దేవాగా చీడీలు దిగాడు నరసింహంగారు.

నేల విడిచి సాము చెయ్యమంటాడేమిటీ ఈయన? ఆమట్న కాళ్లు విరిగితే చోద్యం చూదామనా? పొదుగు కోసుకొని పాలు త్రాగనా!

తణఖా బాకీకని దావా వేస్తాడా కొంపతీసి?

వేస్తే అతగాడి సంకల్పం సిద్ధిస్తుంది కూడాను. నింపాదిగా, లబ్జుగా చెబుతున్నాడుగదా, హితోక్తుల పలుకుతున్నాడుగదా అని దౌర్జన్యంగా రాబట్టుకోడని లేదు.

జానకమ్మ బుర్ర తీవ్రంగా పనిచేస్తోంది.

కోర్టు వ్యవహారాలలో నరసింహంగారు సవ్యసాచి,

కోర్టెక్కడా, కొమ్ములు తిరిగిన ఆసామీని సయితం పాదాక్రాంతం చేసుకోగలడు. అలాని ఆయనకి పెద్దపేరు కూడాను.

ఆ పేరు తెచ్చుకుందుకని ఎంతమందిని ఎన్ని చిత్రహింసలు పెట్టాడని!

అంచాతనే ఆయనకి రావలసిన బాకీలు ముప్పాతిక మువ్వీసం అంతవరకూ పోకుండానే, ఫైసలయిపోతాయి అణాపైసల దేఖీలూ.

లేకపోతే ఎదుటి ఆసామీని ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి,

చిన్నప్పుడు పట్టించిన దొండాకుపసరు గూడా కక్కించి, జన్మజన్మేపీ కోర్టు వాసనంటే హడలిచచ్చేలా బెదురు పెట్టేస్తాడు.

అసలాయనకి పారుపద్దులంటూ ఉండడానికి వీలు లేదు. యాభయ్యా, అరవయ్యా చిల్లరబాకీలు సమేతూ కరెక్టుగా వసూలైపోవాలిసిందే.

ఏ పద్దయినా సజావుగా వసూలయిందా సరేసరి... లేదూ శాస్త్ర ప్రకారం దావా పడిందన్న మాటే. ముగ్గురు గుమస్తాలున్నారాయనకి... వాళ్లు ఓ పట్టాన వ్యవహారం మొక కొలిక్కిరానీరు. అబ్జెక్షన్లతో, స్టే ఆర్డర్లతో, ఇంజక్షన్లతో, అప్పీళ్లతో రాబందులల్లే కొరుక్కుతినేస్తారు. వాళ్లకి చేతినిండా పని ఎప్పటికప్పుడు సమకూడాలి... లేకపోతే వాళ్ల ఉద్యోగాలకే ముప్పు.

మళ్లీ అరువిచ్చేటప్పుడూ, బదుల్లిచ్చేటప్పుడూ ఎంత ఇష్టంగా, ఎంత అభిమానంగా ఇస్తాడనీ! ఏదో ఉద్ధరిస్తున్నట్టూ, ఆపత్తు గడుపుతున్నట్టూ మొహం పెట్టి ఎంత పరోపకారపారీణత వొలకబోస్తాడని!

ఇనపకొట్టుమీదా, బట్టలకొట్టుమీదా వాడకం బాపతు నెల నెలా పదిహేను రోజులకి పైబడి నిలిచిపోయిందా నూటికి రూపాయి పావలా చొప్పున అలా అలా గుడ్లు పెట్టుకొంటూ పోవాలిసిందే!

ఆసామీకి నోటీసు అందిందా, ఇహనా తరవాత చెప్పేదేముంది తట్టా బుట్టా, చెంబూ తపేలా బైట పారేయించేదాకా... నీళ్లు పల్లానికి జలజలాపారి... సమతల ప్రదేశంలో చల్లగా నిలిచిపోయినట్టు... బాకీ వసూలు పర్యంతమూ హియరింగులూ, డిక్రీలూ, జప్తులూ వారంట్లతో సహా... వ్యవహార కాండ యావత్తూ యాంత్రికంగా జరిగిపోవలసిందే...

అప్పుపెట్టాడా... అక్కడ సర్వమంగళమయిందన్నమాటే.

మొట్టమొదట... రుణమిచ్చేటప్పుడు నరసింహంగారు దేవుడు దాన్ని పెంచి పక్వానికి తెచ్చేదశలో చుట్టం ఆఖర్ని కోర్టెక్కించి ఆస్తులు గుంజుతాడూ అప్పుడు దెయ్యం.

ఆయనమాత్రం ఎన్నడూ కటువుగా మాట్లాడడు. మాట్లాడాలిసిన అవసరమూ లేదు. బాకీలకని ఆసాముల్ని యాగీచెయ్యనూ... గోల పెట్టనూ... మొహం చెండుకోనూ... ఇవన్నీ చాతగాని దేవయ్యల కోతి చేష్టలు. చాతనైన పెద్దమనిషి ఎంతో నమ్రతగా, ఎంతో నాగరికంగా వ్యవహారం నడుపుతాడు.

కోసేవి గొంతుకలయినా... అవి మెత్తని ఉల్లిపొర నైలాన్ గుడ్డలతో కోస్తాడు.

ఆమె ఆలోచనాస్రవంతి ఇలా ధారావాహికంగా నడిచింది.

* * *

'నాయనా కిష్టయ్యా, ఏం పనిదీ?'

రాత్రి పదకొండుకి ఆఖరి బస్సు చూచుకుని ఇంట్లో అడుగుపెట్టిన కిష్టాయిని చూచి,

రాగానే నిగ్గదీసింది జానకమ్మ. పనిగట్టుకుని మేలుక్కూచుంది అవాళ.

'ఏం? సంపాయిస్తున్నాను... ఎవరికొంపా తియ్యడం లేదుగా?'

నరసింహంగారొచ్చి వెళ్లినట్టు కిష్టయ్య పసిగట్టాడు.

క్రితంరోజు బస్సు స్టాండులో... గుంటూరు బస్సు దిగుతుండగా... నరసింహంగారు అని తెలియక ఎగబడి... ఆయన సూట్‌కేస్ లాక్కోబోయి... ఫలానా అని చట్టున గుర్తించి... నాలిక కొరుక్కున్నాడు. కిష్టయ్య అప్పుడే అనుకున్నాడు, ఇంటికొచ్చి లెక్చరు దంచుతాడని.

కిష్టుడయినా ఆ పని రహస్యంగా ఏమీ చెయ్యడం లేదు. తెలిస్తే తెలియనీ అని తెగించే మూటలు మోస్తున్నాడు. తెలియకుండా ఎన్నాళ్లని దాగుతుంది?

ముందు పొట్ట గడవాలిగదా.

'ఇంక మనకి ప్రతిష్ట ఏముంటుంది చెప్పు' అంటున్నది జానకమ్మ.

పద్దుల పుస్తకం ముందేసుకుని లిస్టు రాసుకుంటూ వినిపించుకోనట్టు నటిస్తున్నాడు కిష్టయ్య.

'పద్దులు తరవాత చూచుకుందువుగాని స్నానానికిలే అయ్యయ్యో, వొళ్లంతా ఎలా మన్నుగొట్టుకు పోయావోనూ' అనివచ్చి, బలవంతాన పుస్తకం మూసిపెట్టింది జానకమ్మ.

పిల్లలంతా నిద్రపోతున్నారు.

తుండు బుజాన వేసుకుని

'నాకేమయింది వదినా? రంగడు కుచ్చులా ఉన్నాను. ప్రతిష్ట కోసమా? అది వొకప్పుడు వుంది గనకనా నాకు? ఇప్పుడు పోతుందని బెంగ? మొండి కాలికి చెప్పేమిటి? వచ్చి వూదాడూ? దుర్మార్గుడు! పిల్లలు సుభిక్షంగా ఉండటమిష్టం లేదు వాడికి' అని తిట్టుకొంటూనే లైఫ్‌బాయ్ సబ్బు పట్టించాడు వంటికి.

స్నానంచేసి, లుంగీవేసుకుని, పీటమీదవున్న విభూతి పండు కింద పెట్టాడు.

విభూతి పండంటే అతనికి రోత.

విభూతి రేకలు పెట్టుకున్న పెద్దలు చేస్తున్న అకటా వికటపు పన్లుచూచి, వాళ్లనేమీ చెయ్యలేక అతనికా వేడి యావత్తూ విభూతి పండుమీదకి తిరిగింది.

పక్కనే కూచుని వడ్డిస్తో జానకమ్మ నరసింహంగారి దాష్టీకమంతా వివరించి చెప్పింది.

'అయినా... చూడు కిష్టయ్యా... రేపు అమ్మాయి పెళ్లికున్నదా?...'

కిష్టయ్య కర్థమయింది.

ఇష్టమయిన గోంగూర పచ్చడి కలుపుకుంటున్నవాడల్లా చట్టునఆగి, సీరియస్‌గా-

'... వదినా నేను అన్నయ్యనిగాని, నిన్నుగాని అప్రతిష్ట పాలు చెయ్యాలని ఈ పనికి దిగలేదు.

'ఇంటో గడపడం లేదే అన్న తపనకొద్దీ నాకు చాతనయిన పని నేను చేస్తున్నాను. నువ్వు విస్తళ్లు కుట్టడం లేదూ - ఆ మాటకొస్తే?

'నాకూ కాలుమీద కాలువేసుకుని, ఏ చిన్న దుకాణమయినా పెట్టుకుని బుద్ధిమంతుడల్లే ఆర్జించుకోవాలనే వుంది. కాని పెట్టుబడేది? ఆ నరసింహం విదపడాయెను, విదిపితే మన కొట్టే తెరిచేవాణ్ణికదా.

నేను చేస్తున్నదీ వ్యాపారమే - నీకు తెలీదుగాని వొదినా - రెక్కలమ్ముకుంటున్నా - పెట్టుబడిలేని వ్యాపారం.

'ఎవరైనా యాగీచేస్తే, నీ ముందు నన్నుగురించి తేలిగ్గా మాట్లాడితే... నన్నేమీ సమర్థించకు... నా మరిదికి ఉచ్చమూ నీచమూ లేదను... అతగాడికీ మాకూ సంబంధం లేదను... అనవసరమయితే, వాళ్లు తిట్టే తిట్లకీ, పెట్టే శాపనార్థాలకీ నువ్వూ నాలుగు కలిపి దులుపు తెలిసిందా? తిడితే చచ్చీ, దీవిస్తే బతికిన వాణ్ణింతవరకూ చూడలేదు నేను - మెల్లిగా ఆ కొట్టు తెరిపించి - విస్సణ్ణి కూచోపెట్టి... నా దారిన నేను పోతా... కావాలంటే.'

జానకమ్మ దిగాలుపడిపోయింది.

'కోపం తెచ్చుకోకు నాయనా... నిన్ను ఈ నీచానికి వొదిలి నేనూ నాపిల్లలూ పట్టంగట్టు కోమా? నువ్వుమాత్రం నా బిడ్డలాంటి వాడవుకావూ? ప్రీతిగా వినవా?'

బెంచీమీద బొంతపరుచుకున్నాడు కిష్టుడు. జానకమ్మ పిల్లల తలగడలకి గలేబులు మారుస్తున్నది.

'వొదినా ఇటు చూడు ఎవరేమనుకుంటున్నారో అని వెనక్కి తిరిగి తిరిగి చూచుకుంటూ పోయినన్నాళ్లు మనల్ని దరిద్రం వెంటాడితీరిందనుకో. అక్రమానికి ఒడిగడుతున్నామా అని ప్రశ్నవేసుకోవాలి - చాలును.

'నిజానికి ఈ దరిద్రమంతా మనం కొని తెచ్చుకున్నదీ, కోరితెచ్చుకున్నదేను. చెప్ప మంటావా?

'ఏ ఖర్చయినా పెట్టేటప్పుడు - మన స్తోమతెంతో, మనకొచ్చే అయివేజులేమిటో, మన ఆదాయమెంతో, మనమెంతలో ఉండాల్నో ఎప్పుడు లెక్క వేసుకున్నాం చెప్పు?

'అసలీ కొట్టుమీద రెండువేల రుణమెందుకు చెయ్యాలిశొచ్చిందో నీకు తెలియదు. నాకు తెలుసు. చెబుతా విను...'

జానకమ్మ మెదలకుండా ఊరుకుంది. ఏమో ఒకప్పుడు చెప్పారు గనకనా? తను పట్టించుకున్నదీ లేదు. ఇంటో మునగానాం తేలానాం సరిపోయె.

అలవాటుకొద్దీ ఖాళీజేబుల్లో సిగరేట్లకని తడుముకున్నాడు కిష్టుడు. వెల్లకిలా పడుకుని, కాలి మీద కాలు వేసుకుని చెప్పుకుపోతున్నాడు.

జానకమ్మ సావధానంగా వింటున్నది.

'అప్పుడు - అన్నాయి - అదేమో దిగులుగా వుండేవాడు... కొట్టేమో ఊరికి కాస్త దూరంగా వుంది... ఇప్పుడు పలికినంతగా బేరమంతగా పలక్క లాభాలు వుండేవికాదు.

'దానికి తోడు ఆ మధ్య ఒకళ్లిద్దరు పిల్లలు పుట్టిపోయారు.

'ఇంటో రోగాలు రొచ్చులు.

'శనిగ్రహం పట్టుకుని పీడిస్తోంది అనేవాడు అన్నయ్య - ఇక చూచుకో ఆ శనిగాడు ఎక్కడున్నాడో అని వెతకడం ప్రారంభమయింది.

'అప్పుడదిగో ఆ గోవిందయ్యతో దోస్తీ అన్నయ్యకి. గోవిందయ్య పాపం మంచివాడే కాని కొందరి మంచితనం, వదినా, మనల్ని నట్టేట్లో ముంచుతుంది.

'ఎవరో గడ్డపాయల్ని తీసుకొచ్చాడు గోవిందయ్య వాస్తులో నిధి అట. ఆయనొచ్చి పరిక్ష చేశాడు మన కొట్టూస్తలమూ... అవేగా మనకున్న నిక్షేపాలు.

'ఇంకా నయం, అద్దెకొంప వొదిలేసాడు.

'ఆమట్న అదిగో ఆ నుయ్యి తూర్పుదిశగా వుంది; అది పూడ్చి ఈశాన్యంలో తవ్వమన్నాడు. దానిని పూడ్చేందుకెంతయిందో, దీనిని తవ్వేందుకు రెండింతలయింది. ఇంతాజేసి పూడ్చేసిన వరలనుయ్యి మంచినీళ్లది... కొబ్బరినీళ్లల్లే తియ్యగా వుండేవి నమ్మ... కొత్తగా తవ్విన నూతితో నీళ్లు ఉప్పన గాదు సరిగదా చేదు కషాయం... అక్కడ ఒక కిరసనాయిలు గనిగాని వున్నదేమోనని ఇప్పటికీ నమ్మకం నాకు... నీళ్లమీద నూనెమరకలు తేలి కనిపిస్తున్నాయి వదినా.

'ఇకపోతే ఉత్తరదిక్కునవున్న టెక్కీగది పెంచుకున్నాడు; దక్షిణపు వైపుననున్న పెద్దగది పడగొట్టించాడు.

ఆ కొంద్రాకాస్తా గుటుక్కున మ్రింగాడీయన పిప్పరమెంటు బిళ్లల్లే.

ఇలా ఒకటేమిటి? రుణమూ, మధుమేహమున్నవాడి వ్రణమూ మానపట్టవు... అలా అలా సెలవేస్తూ పోతాయంతే.

ఎంతమంది నెత్తిన చేతులు పెట్టలేదీయన? ఇదుగో ఇప్పుడు మన 'టరన్' వచ్చింది అన్నాడు కిష్టయ్య.

గుడి మ్రింగేవాడికి నంది పిండి వడియంట.

చిత్రం - ముదనష్టాలు కలిసినకొద్దీ నరసింహం గారికి ధనదాహం ఎక్కువయింది. నడమంత్రపు సిరి నరాలమీద కురుపులాంటిది. తెగ సలుపుతుంది.

అసలు తిండీ గుడ్డా గూడూ మినహాయించి గుట్టకింద పోగుపడిన ఏ ఆసామీ ఆస్తి అయినా సరే... దాని చరిత్ర కుళ్లగించి చూస్తే పడిపోయిన జీవితాల గోడలు... కరుడుగట్టిన కన్నీటి అగాధాల గాథలు... పెళ్లలు పెళ్లలుగా బయటపడుతయ్యంటాడు కిష్టుడు.

చీమలు పుట్టలు పెడితే పాములు దూరతయ్యందులో అంటాడు. కాని పుట్టలు పెద్దవైతే చీమలే పాములకింద మారతాయని వప్పుకోడు.

కిష్టాయిది అదో గుంటలెక్క.

కష్టపడి సంపాయించుకుని, కాపీనంగా బ్రతికి, నెత్తురూ చీమూ కూడబెట్టినట్టు, కాస్త కాస్త వెనకేసి, ఆస్తులు పెంచినవాళ్లు లేరట్రా అంటే తెల్లబోతాడు కిష్టుడు.

లంకలో పుట్టినవాళ్లంతా రాక్షసులే వాడికి.

జానకమ్మ సావధానంగా వింది.

ఈ కిష్టయ్య నరసింహంగారిని గురించి ఇంతింత సమాచారం సేకరిస్తున్నాడు దేనికని? ఇంతింత ద్వేషం పెంచుకుంటున్నాడు తగునా?... జానకమ్మకి విపరీతంగా భయం పుట్టింది.

ఏదో అనుమానం కుదిపేసినట్టయి –

'కిష్టయ్యా' అని ఒక్క అరుపరిచింది.

'నువ్వుగాని నరసింహంగారిమీద ఏమీ దవుర్జన్యం చెయ్యబోవడంలేదుగదా?'

తేలికగా నవ్వేశాడు కిష్టుడు.

'అదేంలేదు వదినా... ఆయనంటే నాకు కక్షగా వున్నమాట నిజమే. కాని ఆయనమీద నాకున్న పగ తీరనిపగ... తీరదు... దవుర్జన్యానికి దిగితినా మరుక్షణం జైల్లో ఉంటాను. నాకు తెలీదూ?... ఆయనమీద పగ సాధించడమే ముఖ్యమైతే అదో లెక్కలోది కాదనుకో... కాని, ఆ తరవాత మిమ్మల్ని బ్రతికనిస్తాడా? అంచాత, ఆయన జోలికిపోను నేను. నువ్వు నిశ్చింతగా వుండు.

అమ్మయ్య... జానకమ్మ గాఢంగా ఊపిరి తీసుకుంది.

* * *

తరవాత కిష్టయ్య రెండుమూడు రోజులు ఇంటి ఛాయలకే రాలేదు.

విస్సాయిని పంపింది జానకమ్మ.

బస్సుస్టాండులో లేడు.

జానకమ్మకి ఆందోళనగా వుంది.

ఇన్నాళ్లూ అతగాడు దవుర్జన్యాలకి పాల్పడడు కదా అని భయపడింది; ఇప్పుడు అతనిమీద దవుర్జన్యం జరగలేదుకదా అని విలవిల లాడింది.

కాని ఒకనాడు లాకుల కెగువని పందుకొని అవుపించాడనీ, ఒకరాత్రి గోరీలదగ్గర రోడ్డు మలుపులో వొంతెనపిట్టగోడమీద నిదరపోతుండగా చూ వానని పక్కింటి భావనారాయణ చెప్పగా వింది. నిశ్చింతగా వుంది.

* * *

నాలుగోనాడు రాత్రి

తలుపు గొట్టినట్టయి, కళ్లు నులుము కొంటూ గెడతీసింది నరుసు.

కిష్టయ్య లోపలి కొచ్చాడు.

కళ్లల్లో ఊపిరి పెట్టుకున్నాడు.

జుట్టు రేగివుంది.

జానకమ్మా పిల్లలూ అంతా బిలబిలలాడుతూ లేచి వచ్చేశారు.

తెలతెలవారుతోంది.

కిష్టయ్య నవారు మంచంమీద కూలబడ్డాడు.

అందరూ చుట్టూ మూగారు –

'వినండి... ఎవరూ ఏమీ ఖంగారు పడవద్దు' అన్నాడు.

విశ్వాన్ని పిలిచి మూడువందల రూపాయిల కట్ట చేతిలో పెట్టాడు.

'ఇవి పట్టికెళ్లి పురుషోత్తంగారి హోల్‌సేల్ కొట్లో జాబితా ఇచ్చాగాని ఆ మేరకి కొనుక్కు తెచ్చుకో సరుకులు... చిల్లరగా ఎలా అమ్ముకుంటే లాయకీనో ఆయనే చెప్తాడు... రేపటినుంచి కొట్టుతెరు... తెలిశిందా?

'నువ్వు స్కూల్ ఫైనల్ ప్యాసయినా ఇప్పట్లో దవాలీబంట్రోతు ఉద్యోగమేనా దొరికదు... అథవా ఏ గుమస్తాగిరీ అయినా దొరికినా ఆ ముష్టి నూటపాతికా పుచ్చుకుని లింగూలిటుకూమంటో నువ్వూ దేశాలు పట్టిపోతే... ఇక్కడ... ఈ పిల్లలంతా ఏమయిపోయేట్టు? అంచాత... చదువు మాను తెలిసిందా?'

నోట్లు లెక్కపెడుతో, ఎక్కడిదీ డబ్బు అన్నట్టు చూచింది జానకమ్మ.

ఈ డబ్బు నేనేమీ దొంగతనం చెయ్యలేదు. శ్రీనివాసయ్యరు కాఫీహోటల్లో ఏణ్ణర్థం పనిచేస్తానని కంట్రాక్టు వ్రాసివచ్చా. మూడువందలు ఎడ్వాన్సిచ్చాడు – అదీ కథ.

'ఇకపోతే ఈ వూరికి కాలేజీ సాంక్షనయింది వదినా. కాలేజీ మనస్థలం పక్కనే పడుతుందట. ఇంకా ఎవరికీ తెలియదనుకో... కిష్టమాచార్లు చెప్పాడు నాకు... మన స్తలం వెయ్యిగజాలుంది... మంచి ధర పలుకుతుంది... కొట్టు మిగుల్చుకుని అమ్మినా మన అప్పులన్నీ

తీరగా డబ్బు పుష్కలంగా చేతికొస్తుంది... నరుసుకి మంచి సమంధమే వస్తుంది... తాడూ బొంగరంలేని చట్కారీ సమంధాలు చూడవద్దు.

'నరసింహంగారు కాలేజీ కమిటీలో మెంబరు... ఈ రహస్యం ఆయనకీ తెలుసు... అది మభ్యపెట్టి... ఆ స్థలం తురతుర క్రయం రాయించుకుని, గజం ఏ మూడునో నాలుగునో లెక్కకట్టి మన నెత్తిన చేతులుపెట్టి, అది భుక్తం చేసుకుందామని చూస్తున్నాడు దుర్మార్గుడు.

'అది కుదరకుండా చేస్తున్నానని నా మీద కక్ష.

'అంచాత నేనివ్వాలిసిన ఎనిమిది వందలు ప్రోనోటు బాకీకీ నామీద దావా వేశాడు... నీతో చెప్పలేదు బెంబేలైపోతావని... అది మునసబు కోర్టులో ఎక్స్‌పార్టీగా డిక్రీ అయిందిలే. నామీద వారంటు పుట్టింది.'

'వారంటే?'

జానకమ్మ కొయ్యబారిపోయింది.

పిల్లలు అదేమిటో అర్థంకాక ఒకళ్లమొహాళొకళ్లు చూచుకున్నారు.

'ఆ... ఎరెస్ట్ వారెంటు... తాగలేక పిల్లి బోర్ల దోసుకుందట... నన్ను కటకటాల వెనక్కి నెడితే నీ మెడలు వంచ వచ్చుననుకుంటున్నాడు వాడు... కావాలంటే దావా వేసుకుని... అది తేలేసరికి కాలేజీ పడనేపడుతుంది... మరేమీ ఫరవాలేదు... ఈ లోపుగా కొట్టుమీద అమ్మకాలు సాగితే ఇల్లు ఎత్తిపోతుంది కదా.

'విస్సాయికీ కొట్టుమీద అనుభవముంది ఇదివరలో.

'ఈ రెండు రోజులూ ఇంటికి రాలేదు నేను అరెస్టు చేస్తారని... అక్కడా అక్కడా దాక్కున్నాననుకో... కాని ఎన్నాళ్లని దాగను? పిడుగుకి గొడుగు అడ్డమా...?

'అయితే నిన్ను జెయిలుకి పంపి మేమిక్కడ కులుకుతో కూచోమా?'

జానకమ్మ కిదంతా ఏ పాపఫలమా అని కోతగా వుంది లోపల.

'అదిగో, ఆ నీళ్లుగారిపోవడమే వద్దు... ఏమీ ఖంగారులేదు. జెయిలన్నావూ? ఇదిగో మన ఈ అద్దె కొంపకన్నా గట్టిగానే వుంటుంది.. చెక్కతలుపులికి బదులు ఊచతలుపులు... పనీపాటా ఉండదు... ఇంత తిననూ, పండుకోనూ... బలాదూరు తిరగనివ్వరు... ఏదో నా కంచం నేను కడుక్కోవాలి... నా బట్ట నేను ఉతుక్కోవాలి అంతే... దివ్యచకోరంగా వుంటుందిలే... ఓ యబ్బో ఇట్లాంటివి చూశాలే వదినా... మూడు నెలలు... కాదంటే ఆరు నెలలె కూచుంటా... నువ్వు మాత్రం మెత్తబడేవుస్మీ, వదినా స్తలంమాట... వాడి మంత్రం పారనివ్వకు. అంతే.

జైలంటే అతని వర్ణన విడ్డూరంగా వున్నది జానకమ్మకి.

'ఇక నేను వెళ్లి పోలీసుస్టేషన్లో హాజరవుతానుమరి... తప్పించుకొంటూ దొరికినట్టయినా

లారీలతో బాత్తారు వాళ్లు.

'వెడుతున్నా వదినా జాగర్త.'

హుటాహుటిని నడిచిపోతున్నాడు కిష్టయ్య

జానకమ్మ గుమ్మందగ్గర్నే నిల్చుంది.

'ఎంత దురవస్త వచ్చింది నాయనా నీకు... నాకోసం... నా పిల్లలకోసం ఎన్నిపాట్లు తెచ్చిపెట్టాను నీకు?... లోకం 'కులభ్రష్టుడు' అంటుంది నిన్ను.'

పైటకొంగుతో కళ్లొత్తుకుంది జానకమ్మ.